సైనికుడి
కడప-అన్నమయ్య వార్త
తెలుగు దాపీయ దినపత్రిక
మంగళవారం 24 ఫిబ్రవరి 2026

ప్రజలకు వ్యాధులను సత్వరం పరిష్కరించండి

రాజంపేట, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త.

ప్రజల సమస్యలు ఎప్పటికప్పుడు ఆలస్యం చేయకుండా పరిష్కరించాలని రాజంపేట సబ్ కలెక్టర్ హెచ్.ఎస్. భావన ఆదేశించారు. సోమవారం పిజిఆర్ఎస్లో ప్రజల నుంచి వెనుకలు స్వీకరించారు వినతులు పరిశీలించి అప్పటికప్పుడు సంబంధిత తాసిల్దార్ తో మాట్లాడి సమస్యలు పరిష్కరించాలని సూచించారు. తాసిల్దార్ కార్యాలయంలో సమస్య పరిష్కారం కాకపోతేనే సబ్ కలెక్టర్ కార్యాలయంకు రావాలని కోరారు. డివిజన్లోని వివిధ మండలాల నుంచి 16 మంది బాధితులు తమ సమస్యలు పరిశీలించాలని సబ్ కలెక్టర్కు వినతిపత్రం సమర్పించారు.

ప్రజల వినతులు పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ భావన

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

చౌడేపల్లి, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త

ఇంటర్మీడియేట్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ఉదయాన్నే 8.30గంటలకెళ్లా విద్యార్థులు చేరుకొన్నారు. మునినారాయణ ప్రైవేటు కళాశాల, ఉన్నతపాఠశాల ప్లస్2, ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి మొత్తం 88మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సివుండగా 14మంది గైర్హజరైనట్లు ప్రిన్సిపాల్ జయప్రకాష్, డిఓ మోహనాచారిలు తెలిపారు. పరీక్షా కేంద్రం వద్ద పోలీసు బందోబస్తు, వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసారు.

ప్రశాంతంగా ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు

కడప, మదనపల్లె క్రైమ్, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త.

జిల్లా వ్యాప్తంగా ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు సోమవారం అత్యంత కట్టుదిట్టమైన ఏర్పాట్ల మధ్య ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పరీక్షల నిర్వహణ తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి (డిఐఈఓ) తనిఖీలు నిర్వహించారు. తొలి సారి నిమిషం నిబంధన అమలులోకి రావడంతో గత పది రోజుల నుంచి విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కల్పించారు. దీంతో అన్నమయ్య జిల్లాలో విద్యార్థులందరూ సకాలంలోనే పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. తొలి రోజు 14012 మంది రెగ్యులర్ విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా, 13420 మంది హాజరయ్యారు. 592 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. అలాగే 1191 మంది ఒకేషనల్ విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా, 1022 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. 169 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి రవి ముందుగా ఉదయం 8 గంటలకే పోలీస్ స్టేషన్కు చేరుకుని అక్కడ భద్రపరిచిన ప్రశ్నాపత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి, వాటిని నిర్ణీత సమయానికి చీఫ్ సూపర్డెంట్లు, డిపార్ట్మెంటల్ ఆఫీసర్ల పర్యవేక్షణలో ఆయా పరీక్షా కేంద్రాలకు సురక్షితంగా తరలించారు. అనంతరం పలు పరీక్షా కేంద్రాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రాల్లోని వసతులు, ఇన్విజిలేషన్ ప్రక్రియను పరిశీలించారు. అక్కడ గమనించిన కొన్ని చిన్నచిన్న లోపాలను తక్షణమే సరిదిద్దుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. పరీక్షలు ఎక్కడా ఎలాంటి అవాంతరాలు లేకుండా సజావుగా సాగాయి. ఈ సందర్భంగా డిఐఈఓ రవి మాట్లాడుతూ విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది కలగకూడదన్నారు. ఏ చిన్న సమస్య తలెత్తినా వెంటనే నా దృష్టికి తీసుకురావాలని అధికారులకు సూచించడం జరిగిందన్నారు. జిల్లా వ్యాప్తంగా పరీక్షలు అత్యంత క్రమశిక్షణతో, ప్రశాంత వాతావరణంలో ముగిశాయని సంతృప్తి వ్యక్తం చేశారు. నిమిషం నిబంధన అమల్లో ఉన్నందున విద్యార్థులందరూ ముందుగానే కేంద్రాలకు చేరుకోవడంతో ఎక్కడా గందరగోళం చోటుచేసుకోలేదన్నారు. పరీక్షలను సీసీ కెమెరా నివారణ నిర్వహించామన్నారు. మాస్ కాపీయింగ్ కు ఎటువంటి ఆస్కారం లేకుండా స్క్వాడ్ని ఏర్పాటు చేశామన్నారు. పరీక్ష రాసే విద్యార్థుల కావలసిన అన్ని మూలిక వసతులు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

కడప ... రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు ఫస్ట్ ఇయర్ విద్యార్థులకు పరీక్షలు నిర్వహించగా, ఈ నెల 24న సెకండ్ ఇయర్ విద్యార్థులు తమ పరీక్షలకు హాజరుకానున్నారు. పరీక్షల నిర్వహణ కోసం రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 1,537 పరీక్షా కేంద్రాలను ఇంటర్ బోర్డు ఏర్పాటు చేసింది. పరీక్ష సమయానికి ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్షా హాలులోకి అనుమతి ఉండదని అధికారులు ముందుగానే స్పష్టం చేశారు. అయినప్పటికీ కొంతమంది విద్యార్థులు ట్రాఫిక్ సమస్యల కారణంగా ఆలస్యంగా కేంద్రాలకు చేరుకున్నారు. గేటు వద్ద సిబ్బంది వారిని నిలిపివేయడంతో, లోపలికి అనుమతించాలని విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు వేడుకున్నారు. అయితే నిబంధనల ప్రకారం అనుమతి నిరాకరించడంతో కొందరు విద్యార్థులు కన్నీటి పర్యంతమయ్యారు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. కేంద్రాల పరిసర ప్రాంతాల్లోని జిరాక్స్ సెంటర్లను అధికారులు మూసివేశారు.వైయస్సార్ కడప జిల్లావ్యాప్తంగా 16,392 మంది విద్యార్థులు నమోదు చేసుకోగా, మొదటి రోజు 603 మంది గైర్హాజరయ్యారు. అదేవిధంగా ఒకేషనల్ ఇంటర్ విభాగంలో 1,334 మంది నమోదు చేసుకోగా, వారిలో 145 మంది గైర్హాజరయ్యారు. మొత్తంగా తొలి రోజు సుమారు 96 శాతం మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్లు అధికారులు వెల్లడించారు.మొదటి రోజు పరీక్షలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా సజావుగా ముగిశాయి. ఎటువంటి మాల్ ప్రాక్టీస్ లేదా కాపీయింగ్ ఘటనలు చోటుచేసుకోలేదని అధికారులు తెలిపారు.

రాయచోటి బైపాస్ పనులపై కీలక చర్చ

రాయచోటి ఫిబ్రవరి 23 ప్రభాతవార్త

రాయచోటి బైపాస్ పనులపై మంత్రి మడ్డిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆర్ అండ్బి శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డిని అసెంబ్లీలో మర్యాదపూర్వకంగా కలిసి రాయచోటి బైపాస్ రోడ్డు పనుల పురోగతి పూర్తిదశపై ఇరువురు చర్చించుకోవడం జరిగింది. అన్నమయ్య జిల్లా రాయచోటి బైపాస్ రోడ్డు పనుల విషయమై ఆర్అండ్బి శాఖ మంత్రి జనార్దన్ రెడ్డి సానుకూలంగా స్పందించినట్లు ఆయన తెలిపారు అదే విధంగా మంత్రి రాంప్రసాద్రెడ్డిని ఆర్టిసి ఎండి ఎన్ బాల సుబ్రమణ్యం అసెంబ్లీ ప్రాంగణంలో మర్యాదపూర్వకంగా కలిసి స్త్రీ శక్తి పథకం అమలుపై మంత్రి, ఆర్టీసీ ఎండీ ఇరువురుళిగిది భవిష్యత్ కార్యాచరణలపై కీలక సమావేశంలో ఆర్టీసీ బలోపేతం, స్త్రీ శక్తి పథకం అమలు తీరుపై, అలాగే ఆర్టీసీలో తదుపరి కార్యాచరణలపై ఇరువురు విస్తృతంగా చర్చించారు.

నేడు పులివెందులకు వైఎస్ జగన్

రెండు రోజుల పాటు అందుబాటులో జగన్

పులివెందుల, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త :

రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి మంగళవారం పులివెందులకు వచ్చి రెండు రోజులు పలు కార్యక్రమాలలో పాల్గొంటారని వైయస్ జగన్ తాడేపల్లి వ్యక్తిగత కార్యదర్శి నాగేశ్వర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం బెంగళూరు నుంచి పులివెందులకు చేరుకొని క్యాంప్ కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించనున్నారు. రాత్రికి పట్టణంలోని తన నివాసంలో బస చేస్తారు .25వ తేదీ ఉదయం 9:30 కు పులివెందుల నుంచి బయలుదేరి వేంపల్లి మండలం నంది పల్లె గ్రామంలో నూతనంగా నిర్మించిన శివాలయ టెంపుల్ ను సందర్శించుకుంటారు. 11:30 కు నంది పల్లెలో బయలుదేరి 12:30 కు పులివెందుల నివాసానికి చేరుకుంటారు. మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 6.25 వరకు క్యాంపు కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారు. రాత్రికి తన నివాసంలో బస చేస్తారు.26 తేదీ ఉదయం బెంగళూరుకు బయలుదేరి వెళ్తారు.

10వ తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదన్రావు

మదనపల్లె, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త :

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా రెవెన్యూ అధికారి

మార్చి నెలలో జరగబోయే పదవ తరగతి పరీక్షలను అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని, కాఫియింగ్ జరిగితే చర్యలు తప్పవని జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదన్రావు అధికారులను ఆదేశించారు. సోమవారం మదనపల్లె కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్హాలు నందు విద్యా, వైద్య, విద్యుత్, పోలీస్, ట్రెజరీ తదితర శాఖల అధికారులతో పదవ తరగతి పరీక్షలపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 16 నుంచి ఏప్రిల్ 1వరకు పదవ తరగతి పరీక్షలు జరుగుతాయని అధికారులు అందరూ సమన్వయం చేసుకొని పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకొంటామన్నారు. తొలుత జిల్లా విద్యాశాఖాధికారి సుబ్రమణ్యం పదవ తరగతి పరీక్షలపై వివిద అంశాలను జిల్లా అధికారులకు వివరించారు. జిల్లాలో 124కేంద్రాల్లో 22,149మంది విద్యార్థులు పరీక్షలు రాయబోతున్నారన్నారు. మద్యాహ్నం 2.30గంటల నుంచి 5.30గంటల వరకు రాష్ట్ర ఓపెన్స్కూల్ సొసైటి కింద పదవ తరగతి, ఇంటర్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఓపెన్ స్కూల్ పరీక్షలకు 2370మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు అవుతున్నారన్నారు. అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి మాట్లాడుతూ ప్రశ్నాపత్రాలను పరీక్షా కేంద్రాలకు చేరవేయడంలో, విద్యార్థులు రాసిన ఆన్సర్ పత్రాలను ట్రాంగ్రూములకు చేర్చడంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. ఎటువంటి ఇబ్బందులు తలెత్తిన పోలీస్శాఖ వారు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. పరీక్షా సమయంలో విలైనన్ని ఎక్కువ బస్సులు నడపాలని ఆర్టీసి అధికారులను ఆదేశించారు. పరీక్షా సమయంలో విద్యుత్ అంతరాయం కలగకుండా చూడాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 108, 104 వాహనాలు అందుబాటులో ఉండాలన్నారు. ఈసమావేశంలో వివిధ జిల్లాశాఖ అధికారులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్లోనే లంచం లావాదేవీ బట్టబయలు

రూ.4 లక్షల డిమాండ్ కేసులో సీఐ, ఎస్ఐ అరెస్ట్"

సింహాద్రిపురంలో ఏసీబీ ఉక్కుపాదం - జిల్లా వ్యాప్తంగా సంచలనం"

మీడియాతో మాట్లాడుతున్న ఏసీబీ డీఎస్పీ సీతారామారావు

పట్టుబడ్డ సీఐ రమణ ఎస్ఐ అనిల్ కుమార్

బాధితుడు బ్రహ్మం

పులివెందుల ఫిబ్రవరి 23 ప్రభాతవార్త :

సింహాద్రిపురం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్లో సోమవారం చోటుచేసుకున్న ఏసీబీ దాడులు జిల్లావ్యాప్తంగా సంచలనం సృష్టించాయి. ఆంధ్రప్రదేశ్ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) కడప డీఎస్పీ సీతారామారావు నేతృత్వంలో ప్రత్యేక బృందం ఆకస్మికంగా దాడులు నిర్వహించి, పులివెందుల రూరల్ సీఐ రమణ, ఎస్ఐ అనిల్ కుమార్లను అదుపులోకి తీసుకుంది.

లంచం డిమాండ్ - ఒత్తిడులు, బెదిరింపులు..

అనంతపురానికి చెందిన వెంకట బాలాజీ కన్సల్టెన్సీ నిర్వాహకుడు బ్రహ్మం ఫిర్యాదు మేరకు ఈ దాడులు చేపట్టినట్లు అధికారులు వెల్లడించారు. ఇటీవల మహిళ బంగారు గొలుసు చోరీ కేసులో తనకు ఎలాంటి సంబంధం లేకపోయినా, పోలీసులు తనను కేసులో ఇరికిస్తామని బెదిరించి రూ.4 లక్షలు డిమాండ్ చేసినట్లు బాధితుడు ఆరోపించాడు. తాను అంత మొత్తం ఇవ్వలేనని చెప్పడంతో చివరకు రూ.2 లక్షలకు ఒప్పందం కుదిరిందని, గత శనివారం రూ.50 వేలు చెల్లించగా, మిగతా రూ.1.50 లక్షలు సోమవారం ఇవ్వాల్సి వచ్చిందని తెలిపాడు.

..స్టేషన్లోనే పట్టుబడ్డ ఎస్ఐ..

సోమవారం మధ్యాహ్నం స్థానిక పోలీస్ స్టేషన్లో ఎస్ఐ అనిల్ కుమార్ రూ.1.50 లక్షలు స్వీకరిస్తుండగా ఏసీబీ అధికారులు దాడి చేసి రెడ్ హ్యాండెడ్గా పట్టుకున్నారు. ఇదే సమయంలో రూరల్ సీఐ రమణను లింగాల నుంచి పులివెందుల వెళ్తుండగా అదుపులోకి తీసుకున్నారు. ఇరువురినీ సింహాద్రిపురం పోలీస్ స్టేషన్లో సమగ్రంగా విచారిస్తున్నట్లు ఏసీబీ అధికారులు తెలిపారు.

అసలు నిందితుడిని వదిలి.. బాధితుడిపై ఒత్తిడి?..

బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం, తాను అన్ని రికార్డులతో హీరో హోండా షైన్ మోటార్ బైక్ను బీహార్కు చెందిన దిలీప్కు విక్రయించానని పేర్కొన్నారు. ఆ వ్యక్తి చైన్ స్నాచింగ్ కేసుల్లో నిందితుడిగా మారినప్పటికీ, అసలు నిందితుడిని వదిలిపెట్టి తనపై ఒత్తిడి తెచ్చారని ఆరోపించారు.

ఈ కేసులో ఎవరు ఉన్నా కఠిన చర్యలు తీసుకుంటామని ఏసీబీ డీఎస్పీ స్పష్టం చేశారు. బాధితులకు ఏసీబీ ఎల్లవేళలా అండగా ఉంటుందని తెలిపారు. దాడుల్లో ఏసీబీ సీఐ నాగరాజు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆలస్యంగా ప్రశ్నాపత్రాలు

ప్రొద్దుటూరు అర్బన్, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:

రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం నుంచి ప్రారంభమైన ఇంటర్ మీడియట్ పరీక్షలు ప్రొద్దుటూరు పట్టణంలో కూడా ప్రారంభమయ్యాయి. పరీక్షల కోసం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ ఉర్దూ జూనియర్ కళాశాల, శ్రీ విద్యా జూనియర్ కళాశాల, విజ్ఞాన్ జూనియర్ కళాశాల, శ్రీదీప్తి జూనియర్ కళాశాల, అభ్యాస్ జూనియర్ కళాశాల, శ్రీగీతం మహిళా జూనియర్ కళాశాల, నారాయణ జూనియర్ కళాశాల లను సెంటర్లను ఏర్పాటు చేశారు. కాగా ఈ పరీక్షలు మార్చి 18వ తేది వరకు పరీక్షలు జరగనున్నాయి. మొదటి రోజు తెలుగు, సంస్కృతం, ఉర్దూ పరీక్షలు ఉండడంవల్ల ఆర్ట్స్ కాలేజ్ లో జరిగిన సెంటర్లో ప్రశ్నాపత్రాలు అందజేయడంలో విద్యార్థులకు కొంత మేరకు సమయం ఆలస్యమైంది. అక్కడ విద్యార్థులు ఆందోళన పడగా పరీక్ష సమయం పెంచడంతో సమస్య సద్దుమణిగింది. పరీక్షలను పురస్కరించుకుని పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరీక్షా కేంద్రాల వద్ద గట్టి పోలీసు భద్రత ఏర్పాటు చేశారు.

ఖాతాదారుల సొమ్ము స్వాహా పై

అధికారుల విచారణ

సదుం ఫిబ్రవరి 23 ప్రభాత వార్త

మండల పరిధిలోని చెరుకువారిపల్లె బ్రాంచ్ తపాలా కార్యాలయంలో ఖాతాదారుల సొమ్ము స్వాహా చేసినట్లు ఖాతాదారులు ఫిర్యాదు చేశారు. చెరుకువారిపల్లెలో బ్రాంచ్ పోస్టే మాస్టర్గా పనిచేస్తున్నారు. ఆమె ఇటీవల కాలంలో పుంగనూరు ఆరడుగుంట అసిస్టెంట్ బ్రాంచ్ పోస్ట్ మాస్టర్గా బదిలీపై వెళ్లారు. గతంలో ఆమె కందుకూరు వద్ద పనిచేస్తూ అవకతవకలకు పాల్పడినట్లు అధికారులు నిర్ధారన చేయడంతో చెరుకువారిపల్లి బిపిఎం పదవి నుంచి తొలగించి ఏబిపిఎంగా బదిలీ చేశారు. అయితే ఇక్కడ కూడా ఆమె ఖాతాదారుల నగదును మాయం చేసినట్లు అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఆమె నాలుగు రోజుల క్రితం అందరి ఇళ్లకు వెళ్లి ఇన్స్పెక్షన్ ఉందంటూ ఖాతాదారుల పుస్తకాలు సేకరించుకుని వచ్చింది. ఆమెను నమ్మిన ఖాతాదారులు పుస్తకాలు ఇచ్చి పంపారు. ఖాతాదారు తన పుస్తకంలో డబ్బులు లేవని ఆమెను నిలదీశాడు. దీంతో ఆమె తాను మొత్తం మీకు గతంలోనే చెల్లించేశానని చెప్పింది. ఆ ఆ ఖాతా లబోదిబోమనడంతోఈ విషయం తెలుసుకున్న పలువురు గ్రామస్తులు పోస్ట్ఆఫీస్కి వెళ్లి నిలదీశారు. తమ ఖాతాల పుస్తకాలు ఇమ్మని అడిగారు. అయితే కొంతమంది పుస్తకాలు మాత్రమే చూపించగా మిగిలిన పుస్తకాలు చూపించలేదు. దీంతో ఖాతాదారులు సోమవారం చెరుకువారిపల్లె తపాలా కార్యాలయం వద్ద ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయం తెలుసుకున్న పుంగనూరు తపాల ఇన్స్పెక్టర్ మోహన్ తన సిబ్బందితో వెళ్లి కార్యాలయం వద్ద పరిశీలన తెలిపారు. ఈ పరిశీలనలో చాలామంది ఖాతాల పుస్తకాల్లో నగదు నమోదు చేయునట్లు తెలిసింది. దీనితో పాటు పలువురు ఆయన వద్దకు వచ్చి నగదు ఏమైందో చూడాలని పుస్తకాలు పరిశీలించమన్నారు. కొంతమంది పుస్తకాలలో డబ్బులు నమోదుచేసి కనపడ్డాయి. కొంతమంది పుస్తకాలు కనపడలేదు. దీంతో పలువురు తమ పుస్తకాలు ఏమయ్యాయి అంటూ ఆమెను నిలదీశారు. అయితే ఆమె మీరు పుస్తకాలు నాకు ఇవ్వలేదంటూ తిరిగి వారితో వాగ్వివాదానికి దిగింది. మురళి, నిర్మల, హసీనాబీ, నాగేంద్ర, రెడ్డెప్ప ఆసిన్ , రహమదాబీ,ముత్యాలు, తదితరుల ఖాతాదారుల చాలామంది ఖాతాల్లో డబ్బులు నగదు జమ చేయకుండానే ఆమె స్వాహా చేసినట్లు ఒక నిర్ధారణకు వచ్చిన ఇన్స్పెక్టర్ సస్పెండ్ చేస్తూ ఆదేశాలు ఇచ్చారు. మొత్తం నాలుగు వారాలు లో విచారణ పూర్తి చేసి నిజా నిజాలు నిగ్గు తెలుస్తామని ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ మోహన్ తెలిపారు.

కోటకొండలో జలజీవన్ పనులకు ఆర్అండ్బి బ్రేక్

విస్తుపోతున్న కాంట్రాక్టర్లు... ఉన్నతాధికారులూ స్పందించండి.

తంబళ్లపల్లె ఫిబ్రవరి 23 ప్రభాతవార్త :

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జలజీవన్ మిషన్ పథకానికి ఆర్ అండ్ బి అధికారులు అడుగడుగునా పైప్ లైన్ పనులకు బ్రేక్ వేస్తున్నారు. ఈనెల 11వ తేదీన తంబళ్లపల్లె మండల కేంద్రంలో జలజీవన్ మిషన్ పైప్ లైన్ పనులను ఆర్ అండ్ బి అధికారులు అడ్డు తగలగా అప్పట్లో ఆర్డబ్ల్యూఎస్ డిఆర్ఈవో సతీష్ కుమార్, డి ఈ చంద్రశేఖర్ రెడ్డి, డిపిఎం సంజయ్, ఏఈఈలు వినోద్ కుమార్, దినేష్, రియాజ్ లు తరలివచ్చి సమస్య పరిష్కారానికి ఆర్డబ్ల్యూఎస్ అధికారులతో మాట్లాడారు. ఈ విషయం మరువకనే మరోమారు సోమవారం సాయంత్రం మండలంలోని కోటకొండ వద్ద జరుగుతున్న జలజీవన్ పైప్లైన్ పనులను ఓ ఆర్ అండ్ బి అధికారి అడ్డుకున్నారు. పైపులైన్ పనులకు అనుమతి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సదరు కాంట్రాక్టర్ జగన్నాథన్ సంబంధిత ఆర్డబ్ల్యూఎస్ డీఈ తో ఫోన్లో మాట్లాడారు. వారి నుండి సానుకూల సమాధానం రాకపోవడంతో ఆయన జలజీవన్ మిషన్ అధికారులకు ఫిర్యాదు చేశారు. తంబళ్లపల్లె మండలంలో జల జీవన్ మిషన్ పైప్ లైన్ పనులు శరవేగంగా జరుగి దాదాపు పూర్తికావస్తున్నాయి. ఈ నేపథ్యంలో పైప్ లైన్ పనులను అడుగడుగునా ఆర్ అండ్ బి అధికారుల అడ్డుకోవడం తో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోవడంతో జలజీవన్ పథకానికి ఆదిలోనే హంసపాదు చందాన తయారయింది. తంబళ్లపల్లె నియోజకవర్గం వేసవిలో తరచూ తాగునీటి సమస్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవడం పరిపాటి.ఈ సమస్యపై స్పందించిన ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పైలట్ ప్రాజెక్టు కింద తంబళ్లపల్లె, పీలేరు, రాయచోటి నియోజకవర్గవర్గాలకు రూ 2370 కోట్లతో ప్రతి ఇంటికి స్వచ్ఛ నీరు అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇలాంటి ప్రజాహిత బృహత్ కార్యక్రమాలకు తరచూ అడ్డంకులు రావడం తో ఆర్డబ్ల్యూఎస్ అధికారులకు తలనొప్పిగా మారింది. శాశ్వత తాగునీటి సమస్య పరిష్కారం అవుతుందని ఆశపడిన గ్రామీణ ప్రాంత ప్రజలకు ఈ సమస్య శాపంగా నిలవడం పై ప్రజలు విమర్శలు సంధిస్తున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం తో పాటు జిల్లా ఉన్నతాధికారులు యుద్ధ ప్రాతిపదికన స్పందించి జల జీవన్ మిషన్ పైప్ లైన్ పనులు త్వరగా పూర్తిచేసి గ్రామీణ ప్రాంత ప్రజలకు తాగునీరు అందించాలని స్థానిక ప్రజలు కోరుకుంటున్నారు.

సైనిక్ స్కూల్లో బాంబు తనిఖీలు

- ఆందోళన వద్దు, అప్రమత్తంగా ఉన్నాం

- జిల్లా ఎస్పీ ధీరజ్ కనుబిల్లి

కలికిరి, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:

దేశవ్యాప్తంగా ఉన్న సైనిక్ స్కూళ్లతో పాటు ఇతర ముఖ్యమైన ప్రదేశాలకు ఖలిస్థానీ గ్రూప్ పేరుతో ఈమెయిల్ ద్వారా బాంబు బెదిరింపులు వచ్చిన నేపథ్యంలో అన్నమయ్య జిల్లా పోలీసు యంత్రాంగం తక్షణమే స్పందించింది. జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఆదేశాల మేరకు కలికిరిలోని సైనిక్ స్కూల్లో బాంబ్ డిస్పోజల్ స్క్వాడ్, డాగ్స్క్వాడ్, పోలీసులు అత్యంత క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో భాగంగా ఆడిటోరియం, డా.రాధాకృష్ణ బ్లాక్, విద్యార్థుల క్లాస్రూంలు, స్టాఫ్ రూమ్స్, ప్రిన్సిపల్, వైస్ప్రిన్సిపల్ కార్యాలయాలు, విద్యార్థుల డార్మెటరీలు, మెస్, స్టాఫ్ క్వార్టర్స్ను అంగుళం అంగుళం తనిఖీ చేశారు. బాంబు బెదిరింపులు వట్టి పుకార్లేనన్నారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ప్రజలు ముఖ్యంగా విద్యార్థుల తల్లిదండ్రులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. సైనిక్ స్కూలు వద్ద భద్రతను పర్యవేక్షిస్తున్నాం. గుర్తు తెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఇలాంటలి మెయిల్స్ లేదా ఫోన్ కాల్స్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. సోషల్ మీడియాలో వచ్చే పుకార్లను నమ్మవద్దని జిల్లా పోలీస్ యంత్రాంగం ప్రజల రక్షణ కోసం 24 గంటలు సిద్ధంగా ఉందన్నారు. ఏదైనా అనుమానాస్పద వస్తువు లేదా వ్యక్తి కనిపిస్తే వెంటనే డయల్ 112 లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని పేర్కొన్నారు.

ఇంటర్ పరీక్ష కేంద్రాల వద్ద బందోబస్తు

- జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్

కడప క్రైం, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:

జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు సోమవారం నుంచి జిల్లా వ్యాప్తంగా ప్రారంభమైన ఇంటర్ పరీక్ష కేంద్రాల వద్ద పోలీసు అధికారులు పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉన్నందున పరీక్షా కేంద్రాలు ఆవరణలో బయట వ్యక్తులు లేకుండా చర్యలు తీసుకున్నారు. పరీక్షా కేంద్రాల సమీపంలోని అన్ని జిరాక్స్ సెంటర్లను మూసివేయించేలా చర్యలు చేపట్టారు. సెంటర్ల వద్ద సీఐలు, ఎస్సైలతో పాటు పోలీసు సిబ్బందిని నియమించి పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా అన్ని జాగ్రత్తలు తీసుకున్నారు. సెంటర్ల వద్ద మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకురాకుండా కట్టుదిట్టమైన తనిఖీలు నిర్వహించారు. అలాగే ప్రశ్నాపత్రాల రవాణా భద్రతా పరంగా ప్రత్యేక ఎస్కార్ట్ ఏర్పాటు చేశారు. సెంటర్ల పరిసర ప్రాంతాలలో అనుమానాస్పద వ్యక్తులపై నిఘా ఏర్పాటు చేసి ఎలాంటి ఘటనలు జరగకుండా తగు చర్యలు తీసుకున్నారు. పరీక్షల నిర్వహణలో ఎలాంటి లోపాలు, సంఘటనలు తలెత్తకుండా పోలీసు అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ ఆదేశించారు. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలని జిల్లా ఎస్పీ సూచించారు.

గుర్తు తెలియని శవం లభ్యం

దువ్వూరు, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:

మండల పరిధిలోని కడపకర్నూల్ కాలువలో సోమవారం గుర్తు తెలియని శవం లభ్యమైనట్లు ఎస్ఐ ధనుంజయుడు తెలిపారు. కేసీ కాలువలో కామనూరు పోయే రహదారిలో ఒక మగ శవం ఉందని కొందరు తెలుపగా దాన్ని గుర్తించి బయటికి తీశామన్నారు. ఈ గుర్తు తెలియని శవం వయస్సు సుమారు 65 సంవత్సరాలు నుండి 70 వరకు ఉంటుందని పేర్కొన్నారు. విఆర్ఓ మునిస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బాలికను చైల్డ్ వెల్ఫేర్ కమిటీకి అప్పగిస్తాం . ఏఎస్పీ

**మదనపల్లె క్రైమ్,

పిజిఆర్ఎస్ అర్జీల పరిష్కారంపై దృష్టి పెట్టి పరిష్కరించాలి

మదనపల్లి, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త

పీజీ ఆర్ఎస్ అర్జీల పరిష్కారం కోసం ప్రత్యేక దృష్టి పెట్టి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. మదనపల్లి కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని మండలాల నుంచి వివిధ రకాల సమస్యలతో వచ్చిన అర్జీదారుల ను కలెక్టర్ స్వీకరించారు.జిల్లా కలెక్టర్ తో పాటు అర్జీలను స్వీకరించే కార్యక్రమంలో మదనపల్లి సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి, జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదన్ రావు, రాయచోటి ఆర్డీవో శ్రీనివాస్, ఏడి సర్వే భరత్ కుమార్, జి ఎస్ డబ్ల్యూ ఎస్ లక్ష్మీపతి ఆయా శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు. ప్రజల నుండి 348 అర్జీలను జిల్లా కలెక్టర్ స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూపి జి ఆర్ ఎస్ అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి పిజిఆర్ఎస్ అర్జీలకు సంబంధించి ఉన్నతాధికారులతో సమీక్ష చేస్తున్నారన్నారు. జిల్లా అధికారులు అర్జీలను సకాలంలో పరిష్కరించాలని, ఆ యా శాఖల పరిధిలో పిజిఆర్ఎస్ గ్రీవెన్స్ పై ఆడిట్ నిర్వహించాలన్నారు. అర్జీదారులతో నేరుగా మాట్లాడాలని, పెండింగ్ ఆడిట్ పూర్తి చేయాలన్నారు. జిల్లా అధికారులు వారి పరిధిలో ఎలాంటి పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు అర్జీలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. డివిజన్, నియోజకవర్గ, మండల స్థాయి ప్రత్యేక అధికారులు వారికి కేటాయించినమండలాలను, గ్రామాలను పర్యటించి అక్కడి సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు కృషి చేయాలని తెలిపారు. జిల్లాలోని ఆయా శాఖల అధికారులు వారికి కేటాయించిన లక్ష్యాలను చేరుకునే విధంగా అధికారులు క్రమశిక్షణతో పని చేయాలని తెలిపారు.

కృత్రిమ మేదస్సులో ఉన్నత స్థాయి పరిశోధనలు

రాజంపేట, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త:

గణిత పునాదులు బలంగా ఉంటేనే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మిషన్ లెర్నింగ్ రంగాలలో ఉన్నత స్థాయి పరిశోధనలు చేయగలమని వెల్లూరు విఐటి విశ్వ విద్యాలయం గణిత శాస్త్ర విభాగ ప్రొఫెసర్ డా. పి.వి. సత్యనారాయణ పేర్కొన్నారు. కృత్రిమ మేధస్సు – యంత్ర అభ్యాసంలో గణిత శాస్త్ర ప్రాముఖ్యతపై అన్నమాచార్య విశ్వవిద్యాలయంలో సోమవారం గణిత శాస్త్రపు ప్రాముఖ్యతపై సమగ్రంగా వివరించారు. లీనియర్ ఆల్జీబ్రా, ప్రాబబిలిటీ, స్టాటిస్టిక్స్, కాల్కులస్ వంటి గణిత అంశాలు ఎఐ, ఎం ఎల్ అభివృద్ధిలో ఎంత కీలకమన్నారు. ప్రథమ సంవత్సరం బి.టెక్ విద్యార్థులు విస్తృతంగా హాజరై, ఉపన్యాసాన్ని ఆసక్తిగా ఆలకించారు. విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు డా. సత్యనారాయణ సమగ్ర సమాధానాలు ఇచ్చి, వారికి ఉన్న సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో గణిత శాస్త్ర విభాగం అధ్యాపకులు డా. ఎస్. హరినాథ్ రెడ్డి , డా. ఎం. పార్వతి, హ్యూమానిటీస్ అండ్ సైన్సెస్ విభాగాధిపతి డా. ఎల్. ఓబులపతి , తదితరులు పాల్గొన్నారు.

నలుగురి మృతి బాధాకరం

పీలేరు ఫిబ్రవరి 23 ప్రభాతవార్త:

రాజమండ్రిలో జరిగిన కల్తీ పాల ఘటన రాష్ట్రాన్ని కలచివేసింది. విషపూరిత పాలు సేవించి నలుగురు మృతి చెందడం అత్యంత విషాదకరం. కిడ్నీ సమస్యలతో మరికొందరు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారనే వార్తలు మరింత ఆందోళన కలిగిస్తున్నాయి. మృతుల కుటుంబాలకు మా పార్టీ తరఫున ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాము. ఈ ఘటన ప్రభుత్వం నిరక్ష్యాన్నికి నిదర్శనం కాదా అనే ప్రశ్న తలెత్తుతోంది. ఆహార భద్రత విషయంలో పర్యవేక్షణ ఎందుకు విఫలమైంది? కల్తీ పాలు మార్కెట్‌లోకి ఎలా వచ్చాయి? సంబంధిత అధికారుల బాధ్యత ఏమిటి? కూటమి ప్రభుత్వం తక్షణం స్పందించి ఆసుపత్రుల్లో ఉన్న బాధితులకు అత్యుత్తమ వైద్యసేవలు అందించాలి. మృతుల కుటుంబాలకు తగిన ఆర్థిక సహాయం ప్రకటించాలి. ప్రజల ప్రాణాలతో ఆటలాడే కల్తీ మాఫియాపై ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలి. ఈ ఘటన పునరావృతం కాకుండా కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాము

ముఖ్యమంత్రి సహాయ నిధి ప్రజలకు సంజీవిని

సుండుపల్లె, ఫిబ్రవరి 23,ప్రభాతవార్త :

మండలంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర కార్యదర్శి చప్పిడి మహేష్ నాయుడు, మండల అధ్యక్షుడు చప్పిడి రమేష్ నాయుడు కలిసి బాధితురాలు గండ్లూరి చైత్ర తరఫున ఆమె తండ్రి గండ్లూరి కిషోర్ కుమార్‌కు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును అందజేశారు.ఈ కార్యక్రమంలో మండల టిడిపి నాయకులు పాల్గొన్నారు. నాయకులు మాట్లాడుతూ, అవసరంలో ఉన్న కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తున్న సహాయం ఎంతో ఉపయుక్తమన్నారు. ఈ సహాయం ద్వారా గండ్లూరి చైత్ర కుటుంబానికి కొంత ఉపశమనం కలగాలని ఆకాంక్షించారు.

చిన్నారి మృతికి కారకులను శిక్షించాలి

పెండ్లిమర్రి, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:

నాగర్‌కర్నూల్ కుమ్మెర జాతరలో చిన్నారి మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని ఆర్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డీఎం ఓబులేసు యాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం వైవీయూలో ఆర్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో చిన్నారి మృతికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని పోస్టర్‌తో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 78 ఏళ్ల స్వాతంత్ర్య భారతదేశంలో నేటికీ కొనసాగుతున్న కుల ఉన్మాదం పెట్రేగిపోతోందని దాని పర్యావసానమే తెలంగాణ రాష్ట్రంలో నాగర్‌కర్నూలు జిల్లా కుమ్మెర మల్లికార్జున స్వామి జాతరలో జరిగిన దారుణ ఘటనలో 2 నెలల చిన్నారి ప్రాణాలు కోల్పోవడం అత్యంత విషాదకరమని మానవత్వానికి చెంపదెబ్బ అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినిలు వైష్ణవి, వేనజ, శ్రీలక్ష్మీ, సువర్ణ, పుష్ప, అనూష, మమత, చంద్రిక తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ కాలువలు నిర్మించాలని మహిళలు వినతి

కలికిరి, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:

మండలంలోని మర్రికుంటపల్లె గ్రామ పంచాయతీ, గజ్జలవాండ్లపల్లె గ్రామంలో డ్రైనేజీ కాలువ మురుగు నీరు నడిరోడ్డుపైకి రావడంతో ఇబ్బందులు పడుతున్నామని సోమవారం మహిళలు స్థానిక సర్పంచ్ ఎ.రెడ్డిరామ్ దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే సర్పంచ్ రెడ్డిరామ్ స్పందించి గ్రామానికి వెళ్లి మహిళలతో మాట్లాడడం జరిగింది. ఈ డ్రైనేజీ కాలువ నిర్మాణ పనుల సమస్యను పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని సర్పంచ్ రెడ్డిరామ్ మహిళలకు చెప్పడం జరిగింది.

పిజిఆర్ఎస్‌లో 16 అర్జీలు వచ్చాయి

పీలేరు, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త:

పీజీఆర్ఎస్లో వచ్చిన ప్రతి అర్జీని గడువులోపు పరిష్కరించాలని తహశీల్దార్ ఎం. శివకుమార్ అన్నారు. సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో పీజీఆర్ఎస్ నిర్వహించారు. ఈ సమావేశంలో మొత్తం 16 ఫిర్యాదులు వచ్చాయని, ప్రతి అర్జీని గడువులోపు పరిష్కరించాలని కోరారు, వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లు, గ్రామ సచివాలయాల్లో ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని కోరారు. ప్రజలను, రైతులను కార్యాలయాల చుట్టూ తిప్పుకోకుండా ఎప్పటి సమస్యలు అప్పుడే పరిష్కరించాలని తెలిపారు. నాలుగు గ్రామ పంచాయతీల్లో జరుగుతున్న భూ రీసర్వే పారదర్శకంగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీటీ ప్రసాద్, ఆర్య మురగయ్య, సర్వేయర్ రెడ్డి శేఖర్, వీఆర్వోలు హేమంత్ నాయక్, కల్యాణి పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాలను పరిశీలించిన ఎస్సై

రామసముద్రం ఫిబ్రవరి 23 ప్రభాతవార్త

మండలంలో ఇంటర్ మీడియట్ వార్షిక పరీక్షలు అత్యంత కట్టుదిట్టమైన ఏర్పాట్లమధ్య సోమవారం ప్రారంభమయ్యాయి, మార్చి 24 వరకు జరగనున్న ఈ పరీక్షలు కోసం పరిక్షలు జరిగే కేంద్రాలు వద్ద అన్ని ఏర్పాట్లు చేశారు. పరీక్షలు జరిగే కేంద్రాలను ఎస్సై ఉమామహేశ్వర్ రెడ్డి తన సిబ్బంది తో కలిసి తనిఖీ చేశారు. ఎస్సై మాట్లాడుతూ పరీక్ష కేంద్రాలు వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని కాలేజీ వద్ద జిరాక్స్ సెంటర్ లు మూసివేయడం విద్యార్థులు ఎలక్ట్రానిక్ పరికరాలు నిషేధమన్నారు. పరీక్షా కేంద్రాలు వద్ద ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా భారీ బందోబస్త్ ఏర్పాటు చేశామని, ప్రజలు గుంపులు గా నిషిద్ధం మాల్ ప్రాక్టీస్, మాస్ కాపింగ్ వంటి చర్యలు పాల్పడే వారిపై, వారికి సహకరించే వారిపై కఠినమైన క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని,క్రమ శిక్షణ తో, స్వయం కృషి తో అత్యుత్తమ ప్రతిభ కనబరచి తల్లి దండ్రులకు మండలానికి మంచి పేరు తీసుకురావాలని పరీక్షలు రాసే విద్యార్థులకు ఆల్ ది బెస్ట్ చెపుతున్న తొలి రోజు పరీక్ష లకు మొత్తం విద్యార్థులు 201మంది హాజరు కావాల్సి ఉండగా 195 మంది పరీక్ష రాశారని ప్రిన్సిపాల్ చిట్టి బాబు తెలిపారు, ఆరుగురు విద్యా ర్థులు గైర్వాజరైనట్లు పేర్కొన్నారు.

ఇద్దరిపై కేసు నమోదు చేసిన ఎస్సై

రామసముద్రం, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త

అక్రమ మద్యం రవాణాపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. మండలం దిగువ హరిజనవాడకు చెందిన సీతన్నగారి అనిల్ కుమార్ (25), ఉగిని నాగరాజు (47)లు కర్ణాటక రాష్ట్రం బ్యాడపల్లి నుంచి రామసముద్రం కు మద్యం తరలిస్తుండగా చొక్కాండ్లపల్లి చెక్‌పోస్ట్ వద్ద పోలీసులకు పట్టుబడ్డారు. విరినుండీ 100 ప్యాకెట్స్ బ్రాండీ, 192 టెట్రా ప్యాకెట్లు విస్కీ, ఒక ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకొని కేసునమోదు చేసి రిమాండ్ కు తరలిస్తున్నట్లు ఎస్సై ఉమామహేశ్వర రెడ్డి తెలిపారు.. అక్రమ మద్యం రవాణాపై కఠిన చర్యలు కొనసాగుతాయని ఎస్సై హెచ్చరించారు.

సెనగల కనుగోలు కేంద్రం ప్రారంభించిన ఎమ్మెల్యే..

యర్రగుంట్ల ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:

యర్రగుంట్ల కడప రోడ్డులో గల మార్కెట్ యార్డు నందు సోమవారం జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి, టిడిపి జిల్లా అధ్యక్షుడు భూపేష్ రెడ్డి మార్కెట్ యార్డ్ అధికారులతో కలిసి నూతన ప్రభుత్వ శనగల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం క్వింటాకు రూ.5875 మద్దతు ధర ప్రకటించిన విషయం తెలిసిందే ఈ సందర్భంగా జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి మాట్లాడుతూ. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు పెద్దపీఠం వేస్తూ రైతే రాజుగా ఉండాలని ఉద్దేశంతో రైతులను అన్ని విధాలుగా ప్రభుత్వం ముందుండి ఆదుకుంటుందన్నారు. శనగల కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎన్డీఏ నాయకులు, మార్కెట్ యార్డ్ అధికారులు పాల్గొన్నారు.

సమావేశం ఏర్పాటు చేయాలని వినతి

రామసముద్రం ఫిబ్రవరి 23ప్రభాత వార్త

ఎస్సి, ఎస్టీ సమస్యల పరిష్కారానికి నిర్వహిస్తున్న మానిటరీ సమావేశం ఏర్పాటు చేయాలని కోరుతూ మండల మాల మహానాడు దళిత నేతలు సోమవారం తహశీల్దార్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు ప్రతి నెలా మానిటరింగ్ సమావేశాలు జరగాల్సి ఉన్నా గత కొన్ని నెలలుగా సమావేశాలు జరగలేదని అన్నారు. మండల వ్యాప్తంగా దళితులకు తాగునీరు,వీది దీపాలు ,మురుగు నీటి కాలువలు,రోడ్లు ,ఇల్లు, తదితర మౌలిక వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు.ప్రతి నెలా మానిటరింగ్ సమావేశాలు నిర్వహించి దళితుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని వారు తహశీల్దార్ ను కోరారు. ఈ కార్యక్రమంలో మండల అంబేద్కర్ యువసేన అధ్యక్షుడు భాస్కర్,నియోజకవర్గ మాల మహానాడు కన్వీనర్ అంబరీష్ తదితరులు పాల్గొన్నారు.

తప్పుచేసి ఉంటే ఏ శిక్షకైనా సిద్ధమే

ములకలచెరువు, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త

తప్పు చేసి ఉంటే ఏ శిక్ష వేసిన సిద్ధమేనని తంబళ్లపల్లి జనసేన ఇంచార్జ్ పోతుల సాయినాథ్ అన్నారు. సోమవారం ములకలచెరువు జనసేన పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టానికి ఎవరు అతీతులు కారని నిజంగానే తప్పు జరిగింటే.. శిక్ష అనుభవించక తప్పదని అన్నారు. మైనర్ బాలిక కిడ్నాప్ పై కేసు జనసేన పార్టీ పై, నా మీద కక్ష సాధింపు చేయలనే చేస్తున్నారన్నారు. మైనర్ బాలిక విషయంపై ఆరు నెలల క్రితం నన్ను సంప్రదించిన మాట వాస్తవమేనని ,అప్పుడు నా సోదరుడునీ, బాలికను మందలించడం జరిగిందన్నారు. అప్పటి నుండి నాకు నా సోదరుడికి మాటలు లేవని నా వ్యక్తిగతంగా, రాజకీయంగా బిజీగా ఉండడంతో ఈ విషయం తెలిసిన మరుక్షణమే పోలీసులకు చట్టం ముందర అందరూ సమానమేనని తప్పు చేసి ఉంటే చట్టపరమైన చర్యలు తీసుకోమని పోలీసులకు తెలపడం జరిగిందని సాయినాథ్ అన్నారు.

మంత్రిని కలిసిన పద్మశాలి సంఘం నాయకులు

ప్రొద్దుటూరు క్రైం, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:

మంగళగిరిలోని చేనేత జౌళీ శాఖామంత్రి శ్రీమతి సవితను ఆమె నివాసంలో సోమవారం ఏపీ పద్మశాలి సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ దశరథరామయ్య, ప్రధాన కార్యదర్శి అంజిబాబు తదితర నాయకులు కలిశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రొద్దుటూరులోని హనుమాన్‌నగర్‌లో నివాసం ఉన్న చేనేత కార్మికురాలు చెన్నా లక్ష్మీశాంతి అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న విషయాన్ని మంత్రి దృష్టికి తసుకురావడం జరిగిందన్నారు. ఆమె కుటుంబానికి రూ.10లక్షలు ఆర్థిక సాయంతో పాటు పక్కా ఇళ్లు మంజూరు చేయాలని వినతిపత్రంలో కోరినట్లు తెలిపారు. అందుకు మంత్రి స్పందించి వెంటనే సాయం అందేలా ఏర్పాట్లు చేస్తామని మంత్రి హామీ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యదర్శి చింతలపల్లె రుద్రమహేశ్వరుడు తదితరులు పాల్గొన్నారు.

దొంగ బంగారం కొనుగోలుపై విచారణ

గాలివీడు, ఫిబ్రవరి 23(ప్రభాతవార్త):

దొంగలించిన బంగారం కొనుగోలు వ్యవహారంపై మండల కేంద్రంలోని ఓ బంగారు దుకాణదారుడిని పోలీసులు విచారించారు. సత్యసాయి జిల్లా కదిరి రూరల్ సీఐ కృష్ణమోహన్ ఆధ్వర్యంలో ఈ విచారణ కొనసాగింది. కదిరి పరిసర ప్రాంతాల్లో చోరీలకు పాల్పడుతున్న నిందితుడు ఇటీవల పోలీసులకు చిక్కడంతో దర్యాప్తు చేపట్టారు. విచారణలో భాగంగా దాదాపు పెద్ద మొత్తంలో బంగారాన్ని గాలివీడు పట్టణంలోని ఓ బంగారు దుకాణంలో విక్రయించినట్లు నిందితుడు వెల్లడించినట్లు సమాచారం. దీంతో సోమవారం సాయంత్రం పట్టణంలోని బస్టాండు సమీపంలో కొండమ్మ కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న ఓ బంగారు దుకాణంలో పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. విచారణకు సంబంధించిన పూర్తి వివరాలు గోప్యంగా ఉంచినట్లు తెలిసింది. దీంతో పూర్తి వివరాలు వెలుగులోకి రావాల్సి ఉంది. ఈ తనికీల్లో నంబులపూలకుంట ఎస్ఐ కృష్ణమూర్తి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

204 మంది విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ

ప్రొద్దుటూరు క్రైం, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:

ప్రొద్దుటూరు పట్టణంలోని ఎద్దుల వెంకట సుబ్బమ్మ బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న 204 మంది విద్యార్థినిలకు సోమవారం పరీక్షా సామగ్రిని పంపిణీ చేయడం జరిగింది. ఉత్తమ విశ్రాంత ఉపాధ్యాయుడు చిత్రాల శ్రీనివాసులు విద్యార్థులకు అట్ట, పెన్ను, పెన్సిల్, మెండర్, ఎరేజర్, స్కూల్ అందించారు. మంచి ఫలితాలు సాధించి పాఠశాలకు పేరు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. ఎంతోవో శోభారాణి మాట్లాడుతూ ఎక్కువ సంపద కలిగి ఉన్న ఇచ్చే గుణం కలిగిన శ్రీనివాసులుకు ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులో మీరు ప్రయోజకులై ఎపేద విద్యార్థుల ను ఆదుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి మాట్లాడుతూ పదో తరగతి ఫలితాల్లో ప్రొద్దుటూరు పట్టణంలోని ప్రథమస్థానంలో రాణిస్తున్న పాఠశాలగా వైవీఎస్ బాలికలకు గుర్తింపు వచ్చిందని అదే రికార్డును కొనసాగించాలని తెలిఎపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు విజయభాస్కర్, ఉపాధ్యాయులు, విద్యార్థినిలు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు రెవెన్యూ క్లినిక్‌లో ప్రజల నిలదీత

ప్రొద్దుటూరు క్రైం, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:

ప్రొద్దుటూరు మండల పరిధిలోని బొల్లవరం గ్రామ పొలానికి చెందిన మిస్సి నరి దొర నికేల్సన్ జిరాయితీ పట్టా భూమిని కొందరు ఆక్రమించారని ఈ భూమిని సీఎస్ఐటీఏకి గానీ ప్రభుత్వ కానీ స్వాధీనపరచుకునే చర్యలు తీసుకోవాలని మరియు మండల పరిధిలో గల దళిత కాలనీ లే అవుట్ లబ్ధిదారుల లిస్టులను పరిరక్షించాలని జమ్మలమడుగు ఆర్డీఓను బండి రవికుమార్ కోరారు. రెవెన్యూ క్లినిక్ కార్యక్రమంలో భాగంగా ప్రొద్దుటూరు మండలంలోని శాస్త్రినగర్, ప్రకాష్ నగర్‌లోని స్థలాలను నిషేధిత జాబితా నుంచి తొలగించి ప్రజలకు ఇబ్బంది లేకుండా ప్రభుత్వానికి లాభం చేకూరేలా చేయాలని కోరారు. ఈ రెవెన్యూ క్లినిక్ కు దాదాపు 40 ఫిర్యాదులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. సర్వేలో తప్పులు దొర్లడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో గంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే జైలు శిక్ష

కలసపాడు, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త:

స్థానిక తెల్లపాడు క్రాస్ రోడ్డు దగ్గర కలసపాడు ఎస్సై సుభాన్ తన సిబ్బంది తో సోమవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఇందులో భాగంగా నెంబర్ ప్లేట్ లేని వాహనాలు, మైనర్ పిల్లల డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్, రికార్డులు లేని వాహనాలకు చలానాలు విధించారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ నాగార్జున, కానిస్టేబుల్ సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

సిద్ధవటం పోలీస్ స్టేషను సందర్శించిన ఏఎస్పి

సిద్ధవటం, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త

విధి నిర్వహణలో భాగంగా పోలీసులు అంకితభావంతో పనిచేయాలని ఏఎస్ పి, మనోజ్ హెగ్డే పేర్కొన్నారు మండల కేంద్రమైన సిద్ధవటం పోలీస్ స్టేషన్లో ఆయన సోమవారం రాత్రి మాట్లాడుతూ ఫిబ్రవరి, 15 న జరిగిన మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా లంకమల అటవీ ప్రాంతంలో వెలసిన శ్రీ నిత్య పూజేశ్వర కోనకు వచ్చిన శివ భక్తులకు స్వామివారు దర్శనం ప్రతి ఒక్కరికి కలిగే విధంగా బందోబస్తు ఏర్పాటు చేశామని జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న పోలీసులు నిత్య పూజ కోన శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా బందోబస్తుకొచ్చిన ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేశారని ప్రతి ఒక్కరికి నిత్యపూజేశ్వరస్వామి ఆశీస్సులు మీకు ఉండాలని ఏఎస్పి, మనోజ్ హెగ్డే తెలిపారు. ఈ కార్యక్రమంలో ఒంటిమిట్ట సర్కిల్ ఇన్స్పెక్టర్, నరసింహారాజు, మన్నూరు సీఐ లింగప్ప, మండల ఎస్సై హారిక, స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ క్లినిక్ లు

దువ్వూరు, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:

గ్రామాల్లో రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ క్లినిక్ లు నిర్వహిస్తున్నామని జమ్మలమడుగు ఆర్డీవో సాయి శ్రీ అన్నారు. సోమవారం స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో భూ సమస్యలపై రెవెన్యూ క్లినిక్ ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ రెవెన్యూ శాఖ ఆదేశాల మేరకు రెవెన్యూ క్లినిక్ లను నిర్వహిస్తున్నామని ఇందులో ఎంతో కాలంగా ఉన్నా భూ సమస్యలు పరిష్కరించేందుకు వీటి ద్వారా రైతులకు లబ్ధి కలుగుతుంది అన్నారు. రెవెన్యూ క్లినిక్ లో ఆరు విభాగాలు ఉంటాయని వెబ్ ల్యాండ్ లో సమస్యలు ఉంటే అక్కడ దరఖాస్తు ఇవ్వాలని అలాగే ఎవరైనా ఆక్రమించి ఉంటే వాటికి సంబంధించిన దరఖాస్తు ఇవ్వాలని అలాగే మీ సేవ ద్వారా ఏవైనా పొరపాట్లు జరిగి ఉంటే వాటిని సరి చేసే విధంగా అర్జీని ఇవ్వాలన్నారు. మొత్తం ఆరు విభాగాలు ఏర్పాటు చేశామని ఆ కౌంటర్లలో తమ అర్జీలను ఇచ్చి ఆన్లైన్ చేసుకోవాలన్నారు. వీటిని ప్రభుత్వం నిర్ణయించిన నిర్ణీత గడువులోగా పరిష్కరిస్తాం అన్నారు. పరిష్కరించ లేకపోతే ఎందుకు పరిష్కరించలేదో కూడా వివరిస్తామన్నారు. అనంతరం తాసిల్దార్ సంజీవరెడ్డి, సిబ్బంది రైతుల నుంచి వినతి పత్రాలు స్వీకరించారు. మొత్తం ఈ రెవెన్యూ క్లినిక్ లో 45 మంది రైతులు తమ భూములకు సంబంధించిన వినతి పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ సంజీవరెడ్డి, ఎంపీడీవో సుబ్బారెడ్డి, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

బద్వేల్ రెవెన్యూ క్లినిక్‌లో రైతుల సమస్యలపై వినతులు

బద్వేలు ,ఫిబ్రవరి 23, ప్రభాతవార్త

పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన రెవెన్యూ క్లినిక్ సదస్సులో మాజీ శాసనసభ్యురాలు విజయమ్మ మరియు కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జ రోషన్న పాల్గొని , సామాన్య ప్రజల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా భూముల ఆన్‌లైన్ రికార్డులు, , పట్టాదార్ పాస్‌బుక్స్, వారసత్వ మార్పిడి వంటి అంశాలపై రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరంగా వినిపించారు. ఈ సందర్భంగా రైతుల నుంచి పలు అర్జీలు స్వీకరించిన వారు, భూములకు సంబంధించిన ఆన్‌లైన్ లోపాలను సత్వరమే సరిచేసి సమస్యలను పరిష్కరించాలని రెవెన్యూ అధికారులను కోరారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా, సమయపాలనతో సేవలు అందించాలని మాజీ ఎమ్మెల్యే విజయమ్మ సూచించారు. రైతులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి రాకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారి చంద్రమోహన్, తహశీల్దార్ ఉదయభాస్కర్ రాజు, బద్వేల్ రూరల్ సీఐ కృష్ణయ్య, డీఏఓ ఉదయ భారతి, మండల రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అధికారులు ప్రజల వినతులను నమోదు చేసి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఉషాకిరణ్ విద్యార్థుల ప్రతిభ

వేంపల్లె ఫిబ్రవరి 23 ప్రభాతవార్త

రైజింగ్ నాలెడ్జ్ ఎడ్యుటెక్ సొల్యూషన్స్, హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి అబాకస్ పోటీల్లో ఉషాకిరణ్ పాఠశాలకు చెందిన విద్యార్థులు నా

50 శాతం సబ్సిడీతో కవర్లు పొందవచ్చు

లక్కిరెడ్డిపల్లి: అక్టోబర్ 23 ప్రభాత వార్త

మామిడి తోటలో సాగు చేసిన రైతులకు ప్రభుత్వం 50 శాతం సబ్సిడీతో కవర్లు అందిస్తుందని మార్కెట్ యార్డ్ చైర్మన్ ఎస్ ఎండి షఫీ నాయక్, ఉద్యానవన శాఖ అధికారిణి సింధూరిలు పేర్కొన్నారు. సోమవారం కోనంపేట రైతు సేవా కేంద్రంలో 50 శాతం సబ్సిడీతో రైతులకు మామిడి కవర్లను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మామిడి తోటలు సాగు చేసే రైతులు పిందె సైజు నుంచి మామిడికాయలకు తేనె బంక పురుగు భారిన పడకుండా రక్షణ కలుగుతుందన్నారు. ఒక కవర్ రెండు రూపాయలు అవుతుందని కానీ రైతుకి 50 శాతం సబ్సిడీ తో రూపాయికి మాత్రమే ప్రభుత్వ చెల్లిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని మామిడి రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కోనంపేట వైయస్ సర్పంచ్ రజాక్, వెంకటనారాయణ, వీహెచ్ఏలు రైతులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

పెద్దమండెం ఫిబ్రవరి 23 ప్రభాతవార్త

సోమవారం ఇంటర్ పరీక్షలు పోలీసు బందోబస్తు నడుమ కలిసర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రశాంతంగా జరిగాయి. 593 మంది అభ్యర్థులు పరిసర రాయాల్సి ఉండగా 34 మంది గైర్హాజరైనట్లు డిపార్ట్మెంటల్ ఆఫీసర్ చంద్రశేఖర్ అన్నారు. ఎలాంటి సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్సై శ్రావణిరెడ్డి అన్నారు. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయడం జరిగిందన్నారు.

పోషక ఆహార ప్రాముఖ్యతపై అవగాహన

కడప, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త

ప్రభుత్వ పురుషుల కళాశాల కడప, ఎన్ఎస్ఎస్ యూనిట్ వన్ ప్రత్యేక శిబిరం కార్యక్రమాలలో నాల్గవ రోజు సోమవారం పోషకాహార విలువల ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వీరనాగేంద్రకుమార్ విచ్చేసి పోషకాహారం ప్రాధాన్యత, పోషక విలువలు కలిగిన ఆహారము, ఆరోగ్యంలో పోషకాహార పాత్ర మొదలైన అంశాలను ఎన్ఎస్ఎస్ వాలంటీర్లకు వివరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రకాష్‌నగర్‌లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రామకృష్ణ, డాక్టర్ హజరత్ అయ్యా, డాక్టర్ ఎన్. రాజశేఖర్‌రెడ్డి, డాక్టర్ ఎమ్.వి.సురేష్‌బాబు కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

డ్రగ్స్ గంజాయి యువతకు నిశ్శబ్దపు శత్రువు

సిద్ధవటం, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త

యువతను నేరాల బాట పట్టిస్తున్న డ్రగ్స్, గంజాయి వినియోగంపై అవగాహన కల్పించేందుకు జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో రూపొందించిన కరపత్రాన్ని సిద్ధవటం ఎస్సై హరిక విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎస్సై హరిక మాట్లాడుతూ డ్రగ్స్, గంజాయి యువత జీవితాలను నాశనం చేస్తున్నాయి. చిన్న వయసులోనే చెడు అలవాట్లకు బానిసలవుతున్న విద్యార్థులు తమ కుటుంబాల భవిష్యత్తును కూడా ప్రమాదంలోకి నెడుతున్నారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు సమీర్ బాష మాట్లాడుతూ సమాజంలో పెరుగుతున్న మాదక ద్రవ్యాల వినియోగం ఆందోళనకరం. డ్రగ్స్, గంజాయి, కొకైన్, హెరాయిన్ ఏ పేరైతేనేమి ఇవి మనిషి మానసిక, శారీరిక మరియు సామాజిక విధ్వంసానికి కారణమవుతున్నాయన్నారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు రామ కేశవ మాట్లాడుతూ, ప్రతి గ్రామంలో, ప్రతి పాఠశాలలో డ్రగ్స్ వ్యతిరేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉంది. యువత తమ లక్ష్యాలను గుర్తుంచుకొని చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర చెకుముకి కన్వీనర్ బాలు గారి వెంకటసుబ్బయ్య, ఉపాధ్యాయులు డా హరి, కొండయ్య, నరసింహులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

స్తంభించిన సహకార సంఘల సేవలు

ముద్దనూరు, ఫిబ్రవరి 23,ప్రభాతవార్త:

రాష్ట్రవ్యాప్తంగా సహకార సంఘం ఉద్యోగులు తమ డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం తెలియజేసి గత ఎనిమిది రోజులుగా నిరవధిక సమ్మె నిర్వహిస్తున్న ప్రభుత్వం దిగి రాకపోవడంతో ఆమరణ నిరాహార దీక్ష చేపడతామని యూనియన్ సంఘాలు హెచ్చరించాయి. గ్రామపంచాయతీలోని సహకార సంఘాల ఉద్యోగస్తులు సమ్మె బాట పట్టడంతో సంఘాలలో ఉన్న రైతుల రుణాలకు కట్టవలసిన వడ్డీలు ఎక్కువవుతున్నాయి, కొత్త ఋణాలు అందక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉద్యోగస్తుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిసెంబర్ నెల నుంచి సమ్మె చేస్తున్న సహకార శాఖ వారు కరుణించలేదు అందువల్లనే మా ఉద్యోగులందరు సమ్మెచేస్తున్నారు. ఇప్పటికైనా మా యొక్క డిమాండులను తీర్చకపోతే ఆమరణ నిరాహార దీక్ష చేయడానికి కూడా సిద్ధంగా ఉన్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో లో జిల్లా సహకార సంఘ ఉద్యోగుల యూనియన్ ప్రధాన కార్యదర్శి రత్నం మాబుసాని రాజశేఖర్ మిన్నల్ల మరియు వివిధ సంఘ సిబ్బంది పాల్గొన్నారు.

పాము కాటుతో రైతు మృతి

మదనపల్లె క్రైమ్ ఫిబ్రవరి 23 ప్రభాతవార్త

వ్యవసాయ పనుల కోసం పొలానికి వెళ్లిన ఓ రైతు పాము కాటుకు గురై ప్రాణాలు కోల్పోయిన విషాదకర సంఘటన బి. కొత్తకోట మండలంలో చోటు చేసుకుంది. గట్టు గ్రామానికి చెందిన బాబు (60) సోమవారం ఉదయం తన వ్యవసాయ పనుల నిమిత్తం పొలానికి వెళ్లారు. తన పొలంలో పని చేస్తుండగా పాము కాటు వేసింది. గమనించిన తోటి రైతులు వెంటనే స్పందించి, బాబును చికిత్స నిమిత్తం మదనపల్లి జిల్లా ఆసుపత్రికి తరలించారు. అయితే, ఆసుపత్రికి చేరుకునేలోపే బాబు పరిస్థితి విషమించడంతో, ఆయన అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. మృతుడు బాబుకు భార్య లక్ష్మీదేవి, కుమార్తె అనిత ఉన్నారు. కుటుంబ పెద్ద దిక్కును కోల్పోవడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మరమ్మత్తు పనులు త్వరగా చేపట్టాలి

ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త

ప్రొద్దుటూరు పట్టణంలోని వైఎంఆర్ కాలనీ పట్టణ ఆరోగ్య కేంద్రంలో మరమ్మత్తులు, ఫ్లోరింగ్ పనులు త్వరగా చేపట్టాలని భారతీయ జనతా పార్టీ పట్టణ అధ్యక్షుడు ఆధ్వర్యంలో కడప కలెక్టరెట్ లో పబ్లిక్ గ్రీవెన్స్ రీ అడ్రసల్ సిస్టమ్ నందు కోరారు. పట్టణంలోని వైఎమ్ఆర్ కాలనీ నందలి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు రిపేర్స్ మరియు కాంపౌండ్ లో పల ఫ్లోరింగ్ కొరకు ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ తో మాట్లాడి సిడిఎంఏ నుండి గత ఏడాది జనవరి 8వ తేదిన లెటర్ వచ్చిందని, కాని ఇప్పటి వరకు దానిపై ఎలాంటి స్పందన లేదని వివరించారు. డిఆర్వో ప్రొద్దుటూరు మునిసిపల్ కమీషనర్ కి ఫోన్ చేసి త్వరగా పనులు చేయించాలని కోరారు.

అంగన్వాడీలకు కనీస వేతనం అమలు చేయాలి

రాజంపేట, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త:

డిమాండ్లు పరిష్కరించాలని రాజంపేటలో ఆందోళన చేస్తున్న అంగన్వాడీలు

అంగన్వాడీలకు కనీస వేతనం రూ 26 వేలు అమలు చేయాలని అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా నాయకురాలు ఈశ్వరమ్మ డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ అంగన్వాడి వర్కర్స్ అండ్ సర్పంచ్ యూనియన్ పిలుపుమేరకు తలపెట్టిన మూడు రోజుల రిలే దీక్షలలో భాగంగా సోమవారం ఎన్జీవో కార్యాలయం వద్ద అంగన్వాడీలు రిలే దీక్షలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం లో ప్రతిపక్ష పార్టీగా ఉన్న తెలుగుదేశం పార్టీ తాము అధికారంలోకి వస్తే కనీస వేతనం 26 వేలు అమలు చేస్తామని ఇచ్చిన హామీ అధికారం చేపట్టి రెండేళ్లయినా మాట నిలబెట్టుకోలేదన్నారు. రాష్ట్ర బడ్జెట్లో ఆ ఊసే లేదని, అసెంబ్లీ సమావేశాలలో కూడా ప్రస్తావన తీసుకొస్తారన్న ఆశ కూడా లేదని అన్నారు. పెండింగ్‌లో ఉన్న 1810 మినీ వర్కర్లకు క్వాలిఫికేషన్ రిలాక్సేషన్ ఇచ్చి మెయిన్ సెంటర్లుగా మార్చాలని కోరారు. గ్రాట్యూటీ అమలకు గైడ్ లైన్స్ రూపొందించాలని, వేతనంతో కూడిన మెడికల్ లీవ్ ఇవ్వాలని, అంగన్వాడీలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. మే నెల అంతా వేసవి సెలవులు ఇవ్వాలని, లబ్ధిదారులకు నూనె, కందిపప్పు పరిమాణం పెంచాలని, మెనూ చార్జీలు పెంచాలని, ఉచితంగా గ్యాస్ సరఫరా చేయాలని, ప్రీ స్కూల్ బలోపేతం చేయాలని, ప్రీ స్కూల్ పిల్లలకు తల్లికి వందనం పథకం అమలు చేయాలని, ఐదు సంవత్సరాలలోపు పిల్లలందరూ అంగన్వాడీ కేంద్రంలో ఉండేలా జీవో తేవాలని, ప్రీ స్కూల్ పిల్లలకు సాయంత్రం స్నాక్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్లు నెరవేరే వరకు పోరాటాలు కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ రిలే దీక్షలకు సిఐటియు పట్టణ కన్వీనర్ పి.వి రమణ, మునిసిపల్ యూనియన్ పట్టణ కార్యదర్శి కే.ప్రసాద్ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీలు ఎం.విజయమ్మ, ఎం.నాగ సులోచన, బి.లక్ష్మీదేవి, జి.సుభాషిణి, బి.సుబ్బమ్మ, పీ.వీ శివరంజని, డి.మమత, వి.విజయలక్ష్మి, బి.మీన తదితరులు పాల్గొన్నారు.

మద్దతు ధరకే విక్రయించుకోండి

ముద్దనూరు,ఫిబ్రవరి 23 ప్రభాతవార్త:

మండలంలోని కెతిమ్మాపురం గ్రామంలో రైతు సేవా కేంద్ర సిబ్బంది సోమవారం నిర్వహిస్తున్న సీఎం యాప్‌లో శనగలు, కందులు రిజిస్ట్రేషన్ పక్రయను పరిశీలించినట్లు మండల వ్యవసాయ అధికారి మారెడ్డి వెంకట క్రిష్ణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయా గ్రామాల్లో పంట నమోదు చేసుకున్న రైతులకు ప్రభుత్వం కల్పించిన మద్దతు ధరకు అమ్ముకోవడానికి రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి అని రిజిస్ట్రేషన్ చేసుకున్న వెంటనే రైతుకు మెసేజ్ రావడం జరుగుతుంది అన్నారు. అలాగే ఏ తేదీన ఎన్ని క్వింటాల్ తీసుకుని రావాలి,అనే సందేశం రైతుల మొబైల్ కు వస్తుంది అన్నారు. కావున రైతులు ఆయా రైతు సేవా కేంద్రాల సిబ్బందిని సంప్రదించి ప్రభుత్వ మద్దతు ధరకు అమ్ముకునే రైతులు సీఎం యాప్‌లో తమ వివరాలను నమోదుచేసుకోవాలి అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు సందీప్‌కుమార్ గ్రామ రైతులు పాల్గొన్నారు.

అంగళ్లలో ఈద్గా భూమిపై వివాదం

రంజాన్ ప్రార్థనలకు ఆటంకం కలిగించవద్దు

మదనపల్లె క్రైమ్ ఫిబ్రవరి 23 ప్రభాతవార్త.

కురబలకోట మండలం అంగళ్ళు గ్రామంలోని ఈద్గా భూమి విషయంలో ప్రైవేట్ కాలేజీ యాజమాన్యం అనుసరిస్తున్న తీరుపై ముస్లిం మత పెద్దలు, జమాత్ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. సోమవారం వారు పిజిఆర్ఎస్‌లో జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దశాబ్దాలుగా తమ ఆధీనంలో ఉన్న ప్రార్థనా స్థలాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, కళాశాల యాజమాన్యం ప్రధాన రహదారి నుండి ఈద్గాలోకి వెళ్లే దారిలో రాతి కూసాలు వేసి, రాకపోకలను అడ్డుకుంటున్నారని ఆరోపించారు. రంజాన్ మాసం ప్రారంభమవుతున్న తరుణంలో, ప్రార్థనలకు ఎటువంటి ఆటంకం కలగకుండా పోలీసులు స్పందించి న్యాయం చేయాలని జమాత్ సభ్యులు కోరుతున్నారు.

శాంతి భద్రతల పరిరక్షణ కోసమే తనిఖీలు

యర్రగుంట్ల ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:

శాంతి భద్రతల పరిరక్షణ కోసమే తనిఖీలు చేపట్టినట్లు యర్రగుంట్ల సీఐ విశ్వనాథ్ రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని సుందరయ్య నగర్‌లో సోమవారం ఉదయం పోలీస్ సిబ్బందితో కలిసి తనిఖీలను నిర్వహించారు. ఈ తనిఖీల్లో సరైన పత్రాలు లేని 12 బైకులు, 2 ఆటోలను సీజ్ చేసినట్లు సీఐ వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై నాగ మురళి, ఏఎస్ఐలు సిబ్బంది పాల్గొన్నారు.

పొడి చెత్త ఇచ్చి సరుకులు తీసుకోండి

లక్కిరెడ్డిపల్లి: అక్టోబర్ 23 ప్రభాతవార్త

ప్రజలు స్వచ్ఛ రథాలను సద్వినియోగం చేసుకుని పొడి చెత్త ఇచ్చి బదులుగా నిత్యావసర సరుకులు తీసుకోవాలని మాజీ మండల అధ్యక్షులు ఉమాపతి రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం అనంతపురం గ్రామపంచాయతీలోని చౌటపల్లి నందు స్వచ్ఛ రథం వాహనం వద్ద ఆయన మాట్లాడుతూ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి లక్ష్మీ ప్రసాద్ రెడ్డి ల సహకారంతో వాహనాన్ని లక్కిరెడ్డిపల్లి మండలానికి ఇవ్వడం జరిగిందన్నారు. ప్రజలు తమ గృహాలు, దుకాణాల్లోని పొడి చెత్తను ఆరు బయట పారవేయకుండా స్వచ్ఛ రథాలకు అందించి, ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని నెరవేర్చాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సెక్రెటరీ మధుసూదన్ గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

రామేశ్వరం హుండీ ఆదాయం 80,035

ప్రొద్దుటూరు అర్బన్ ఫిబ్రవరి 23, ప్రభాతవార్త

పట్టణంలోని రామేశ్వరంలో వున్న శ్రీముక్తి రామలింగేశ్వర స్వామి ఆలయ హుండీలను సోమవారం భక్తులు, అర్చకులు, ధర్మకర్తల సమక్షంలో లెక్కించగా 2025 డిసెంబర్ 29వ తేదీ నుండి సోమవారం వరకు అనగా దాదాపు 1 నెల 25 రోజులకు గాను 80,035 రాబడి వచ్చిందని ఆలయ కార్యనిర్వహనాధికారి ఈ ఏ. శ్రీధర్ తెలిపారు. ఈ లెక్కింపు పర్యవేక్షణకు దేవాదాయ శాఖ ఇన్స్పెక్టర్ కిరణ్ కుమార్ రెడ్డి, ఆలయ ధర్మకర్త సన్నుతి శ్రీనివాసులు, ఆలయ అర్చకులు బి. రాజశేఖర్ శర్మ, టి. శివయ్య శర్మ మరియు ఆలయ సిబ్బంది, భక్తులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

సంత్ గాడ్గే జయంతి వేడుకలు

పొరుమామిళ్ల రూరల్, ఫిబ్రవరి 23 ప్రభాత వార్త:

స్వచ్ఛభారత్ ఎ తామహుడు సంత్ గాడ్గే బాబా150 జయంతి వేడుకలు సోమవారం పొరుమామిళ్లలోని రజక సంఘం కార్యాలయంలో ఆల్ ఇండియా ధోబి మహా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కృష్ణయ్య ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంత్ గాడ్గే బాబా తన కీర్తనల ద్వారా పాటల ద్వారా జనాన్ని చైతన్యపరిచి స్వచ్ఛభారత్‌కు ఆధ్యుడయ్యారని ఆయన సేవలను కొనియాడారు. సంత్ గాడ్గే బాబా లాంటివారు రజక సామాజిక వర్గంలో జన్మించడం తమ జాతికి గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం నాయకులు మున్నెల్లి గురవయ్య, గోవిందాయ పల్లె గురవయ్య, బొజ్జ నారాయణ, రవి తదితర రజక సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఆరవ తరగతి ప్రవేశానికి దరఖాస్తులు

కేవీ పల్లె ఫిబ్రవరి 23 ప్రభాతవార్త:

కె వి పల్లి మండలంలోని అదర్శ పాఠశాలలో అరవ తరగతిలో ప్రవేశానికి 2026, 2027 విద్యా సంవత్సరానికి గాను దరఖాస్తులు స్వీకరిస్తునట్లు ప్రిన్సిపాల్ డా.మూడే శీను నాయక్ తెలిపారు. ఏప్రిల్ 12వ తేదీ ఉదయం 10:00 నుండి 12 గంటల వరకు ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. ఈ ప్రవేశ పరీక్షకు ఆన్లైన్లో దరఖాస్తులు కోరడమైనది.ప్రవేశ పరీక్ష 5వ తరగతి స్థాయిలో తెలుగు /ఇంగ్లీష్ మీడియంలలో నిర్వహిస్తారన్నారు. ఆదర్శ పాఠశాలలో బోదనా మాధ్యమము ఇంగ్లీషులో ఉంటుందని తెలిపారు. ఎటువంటి ఫీజులు వసూలు చేయబడవు. ప్రవేశ వయస్సు ఓసి, బీసీ కులాలకు చెందిన విద్యార్థులు 01.09.2014 లేదా31.08.2016 మధ్యపుట్టి ఉండాలి, ఎస్సీ ఎస్టీ కులాలకు చెందిన విద్యార్థులు 01.09.2017 మరియు 18.8.2016 మధ్య పుట్టి ఉండాలని తెలిపారు. పరీక్షా రుసుము ఓసి మరియు బీసీలకు 200 రూపాయలు ఎస్సీ ఎస్టీలకు 125 రూపాయలు.దరఖాస్తు చేయడానికి ముందస్తు వివరాలతో కూడిన సమాచారము కొరకు లో cse website దరఖాస్తు చేసుకోవాలన్నారు. పాఠశాల పనివేళలు సమయంలోసంప్రదిచిన దరఖాస్తు చేయుస్తారు అని తెలిపారు. చివరి తేది 31.03.2026 అని తెలిపారు.

అమ్మచెరువు మిట్ట సచివాలయంలో ఉద్యోగుల కొరత

ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఒకటవ వార్డు ప్రజలు

మదనపల్లె, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త :

మున్సిపాలిటి పరిధిలోని 1వ వార్డు అమ్మచెరువు మిట్ట సచివాలయంలో ఉద్యోగుల కొరత ఉండడం వల్ల వార్డు ప్రజలు ప్రజాసమస్యల పరిష్కరించుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు. అన్నమయ్య జిల్లాలోని పెద్ద సచివాలయంగా ఉంటున్న పరిధిలో 7500మంది ఓటర్లు కలరు. ఈ సచివాలయంలో తొలినుంచి ఇన్‌చార్జ్ ఉద్యోగులు పనిచేస్తుండడం వల్ల కొంతకాలం తరువాత వారు మరో సచివాలయానికి అధికారులు బదిలీ చేస్తుండడంతో అమ్మచెరువుమిట్ట సచివాలయంలో రెగ్యులర్ ఉద్యోగుల కొరత ఏర్పడుతోంది. ప్రధానంగా రెవెన్యూ శాఖకు సంబంధించి విఆర్ఓ, మౌళిక సదుపాయాల కార్యదర్శి, ప్లానింగ్ సెక్రటరీలు ఇన్‌చార్జ్‌లే వ్యవహరిస్తుండడం వల్ల ఈ వార్డులో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలకు సంబంధించి వార్డు సర్వే చేసేందుకు ఉద్యోగుల కొరత ఉండడం వల్ల సకాలంలో చేయలేకపతున్నారు. అధికంగా పేదలు నివసించే ఈ వార్డులో సచివాలయంలో ఉద్యోగుల కొరత అధికంగా ఉండడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి అమ్మచెరువుమిట్ట సచివాయాలనికి ఉద్యోగుల కొరత తీర్చాలని పలువురు కోరుతున్నారు.

టమోటా రైతులను ఆదుకోండి

పిజిఆర్ఎస్‌లో బివైఎస్ వినతి

మదనపల్లె, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త :

జిల్లా కలెక్టర్‌కు విన్నవిస్తున్న దృశ్యం

మదనపల్లె టమోటా రైతులను ఆదుకోవాలంటూ బహుజన యువసేన రాష్ట్ర అధ్యక్షులు పునిత్ డిమాండ్ చేశారు. సోమవారం మదనపల్లె కలెక్టరేట్‌లో జరిగిన పిజిఆర్ఎస్‌లో టమోటా రైతులను ఆదుకోవాలని ఆయన జిల్లా కలెక్టర్‌కు విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఆసియా ఖండంలోనే అతిపెద్ద మార్కెట్‌యార్డుగా ఉన్న మదనపల్లెలో టమోటా రైతులకు కనీస గిట్టుబాటుధర లేకపోవడం వల్ల తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. రైతులు పండించిన పంటను పొలాల్లో, రోడ్లపై వదిలివేస్తున్నారంటూ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. టమోటా రైతులకు గిట్టుబాట ధర కల్పించి ప్రభుత్వం నేరుగా టమోటాలను కొనుగోలు చేయాలన్నారు. రైతులకు టమోటా రవాణా ఖర్చులపై రాయితీలు ప్రకటించాలన్నారు. శీతలగిడ్డంగులు ఏర్పాటు చేసి టమోట నిల్వ ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. టమోటా ప్రాససింగ్ పరిశ్రమలు ఏర్పాటు చేసి టమోటా సాస్, పౌడర్ వంటి ఉత్పత్తులు తయారు చేసి రైతులను ఆదుకోవాలన్నారు. రైతుల ఆత్మహత్యలను నివారించాలన్నారు.

ఒడిస్సాలో సీనియర్ సిటిజన్స్ జాతీయ మహాసభలు

రాష్ట్ర ఉపాధ్యక్షులు మునిగోపాల్‌క్రిష్ణ

మదనపల్లె, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త :

సమావేశంలో పాల్గొన్న దృశ్యం

ఒడిస్సా రాష్ట్రంలోని భువనేశ్వరి రైల్వే ఆడిటోరియంలో జరిగిన ఆల్ ఇండియా సీనియర్ సిటిజన్స్ కాన్ఫరెన్స్ మహాసభల్లో వృద్ధుల సమస్యలపై చర్చించినట్లు రాష్ట్ర సీనియర్ సిటిజన్స్ ఉపాధ్యక్షులు డాక్టర్ మునిగోపాల్‌క్రిష్ణ తెలిపారు. గత రెండు రోజులుగా ఒడిస్సాలో సీనియర్ సిటిజన్స్ మహాసభలు జరుగుతున్నాయన్నారు. జాతీయ సీనియర్ సిటిజన్స్ అధ్యక్షులు మహారాజ్ క్రిష్ణరెయినా, సెక్రటరీ శ్రీహరి ఆధ్వర్యంలో ఈ మహాసభలు జరుగుతున్నాయన్నారు. రాష్ట్ర అధ్యక్షులు నారాయణమూర్తి, జనరల్ సెక్రటరీ రామచంద్రరావు, జాయింట్ సెక్రటరీ వీరరావ్, వెంకటేశ్వర్‌రావు, నాగేంద్రరెడ్డిలు హాజరై చర్చించినట్లు తెలిపారు. ప్రధానంగా రైల్వేలో సీనియర్ సిటిజన్స్‌కు ఉచిత పాసు కల్పించాలని డిమాండ్ చేసినట్లు మునిగోపాలక్రిష్ణ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం వృద్ధులకు అన్ని విధాల ఆదుకోవాలని కోరారు. రైల్వేపాసులో రాయితీని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రిసీనియర్ సిటిజన్స్ సమస్యలను టిబిఆర్ వివరించినట్లు తెలిపారు.

ఉయ్యాలవాడ అవార్డుకు మున్నల్లి పెద్ద ఓబులేసు

కాశినాయన ఫిబ్రవరి 23. ప్రభాతవార్త

కాశినాయన మండలం నాయన పల్లి గ్రామానికి చెందిన నటరాజ కులుకు భజన, జడకోపు, కోలాటం గురువు మున్నెల్లి పెద్ద ఓబులేసుకు వాజ్ పేయి అద్వానీ సేవా సంస్థ వ్యవస్థాపకులు పాలకొలను పీరారెడ్డి, ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగ టీచర్ బిఎస్ నారాయణరెడ్డి ఆధ్వర్యంలో స్వాతంత్రం సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతి సందర్భంగా స్వచ్ఛందంగా నిరంతరం సమాజసేవలో చేస్తున్న వారికి ఆన్లైన్ ద్వారా ప్రథమ స్వాతంత్ర సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి పేరు మీద అవార్డు పురస్కారము అందజేశారు. ప్రథమ స్వాతంత్ర సమరయోధులు ఉయ్యాలవాడ నరసింహారెడ్డికి భారతరత్న ఇవ్వాలని కోరుతున్నారు 45 సంవత్సరాలు నుండి చెక్కభజన, జడకోపు, కోలాటం గ్రామీణ ప్రాంతాలలో కళా రంగాలను ప్రోత్సహించడంలో తన ఎంతో శ్రమించారూ రాయలసీమ జిల్లాలలో కాకుండా అనేక జిల్లాలలో పేరు ప్రతిష్టలు పొందినటువంటి చెక్కభజన గాన కోకిల నాయనపల్లి మున్నెల్లి పెద్ద ఓబులేసు ప్రథమ స్వాతంత్ర సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి అవార్డు అందుకున్నారు. స్వాతంత్ర సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి అవార్డు అందుకోవడం చాలా ఆనందంగా ఉందని ఈ అవార్డుకు నన్ను ఎంపిక చేసినందుకు ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్ బిఎస్ నారాయణరెడ్డి కి ప్రత్యేకమైన కృతజ్ఞతలు తెలియజేశారు.

ప్రైవేటు ఏజెన్సీపై చర్యలు తీసుకోవాలి

కలెక్టరేట్ వద్ద మాలమహానాడు నిరసనలు

మదనపల్లె, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త :

ప్రభుత్వ వైద్యశాలలో కార్మిక చట్టాలను ఉల్లంఘించిన ప్రైవేటు ఏజెన్సీ, అధికారులపై చర్యలు తీసుకోవాలని మాలమహానాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తుమ్మల తరుణ్‌కుమార్ తెలిపారు. సోమవారం మదనపల్లె కలెక్టర్‌లో జరిగిన పిజిఆర్ఎస్‌లో ఆయన జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్‌కు విన్నవించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీలేరు ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాలలో పారిశుద్ధ్య కార్మిక సిబ్బందికి, భద్రతా సిబ్బందికి పిఎఫ్ బకాయిలు, ఈఎస్ఐ కార్డులు మంజూరు కార్మిక చట్టప్రకారం సెలవులు మంజూరు చేయని ఆసుపత్రి పర్యవేక్షణ అధికారి, సిఎస్ఆర్ఎంఓలపై విచారణ చేసి చర్యలు తీసుకొని ఏజెన్సీ కాంట్రాక్టర్ల గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల చేత వెట్టిచాకిరి చ

ఘనంగా శ్రీ శివపార్వతుల కళ్యాణం



ప్రొద్దుటూరు అర్బన్, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త :

పట్టణంలోని మిట్టమడి మూడవ వీధిలో విశ్వవాసనామ సంవత్సరం ఫాల్గుణ శష్టి సోమవారం సందర్భంగా శ్రీ శివపార్వతుల కళ్యాణ మహోత్సవం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. గత ఏడాది నుంచి టీ. శివస్వామి, చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతూ వస్తుండగా, ఈ సంవత్సరం కూడా వేద మంత్రాల నడుమ శాస్త్రోక్తంగా కళ్యాణం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారి ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమానికి లోకాసంస్థ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇంటర్నేషనల్ లిబరేషన్ రాయలసీమ చైర్మన్ సి. శ్రీనివాసులు, రాయలసీమ ఎగ్జిక్యూటివ్ మెంబర్ వై. రామిరెడ్డి, లీగల్ అడ్వైజర్ రాముడు, ప్రొద్దుటూరు జనరల్ సెక్రటరీ దుత్తలూరు శ్రీధర్, మహిళా విభాగం జనరల్ సెక్రటరీ అరుణ, ఎల్లయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు, రామిరెడ్డిను శాలువా కప్పి సత్కరించి శివపార్వతుల చిత్రపటాన్ని అందజేశారు. భక్తులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేశారు. రాత్రి భజన కార్యక్రమం నిర్వహించనున్నారు. కార్యక్రమం ఆధ్యాత్మిక వాతావరణంలో విజయవంతంగా కొనసాగింది.

మార్చి 8న మహిళలకు ఆటలు

కడప కార్పొరేషన్ ఫిబ్రవరి 23 ప్రభాతవార్త:

కడప ఏపీ ఎన్జీజీవోస్ కార్యాలయం నందు జిల్లా అధ్యక్షులు బి శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఏపీ ఎన్జీజీవోస్ జిల్లా మహిళా విభాగము సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మార్చి 8వ తేదీ ప్రపంచ మహిళా దినోత్సవం పురస్కరించుకొని మహిళలకు ఆటల కోసం జిల్లా మహిళా విభాగమును ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగినది. చైర్ పర్సన్ బి కృష్ణకుమారి, కో చైర్ పర్సన్ డి.విజయనిర్మల దేవి, వైస్ చైర్ పర్సన్ ఏకే పద్మజ, వైస్ చైర్ పర్సన్ జ్యోతి మనీ, వైస్ చైర్ పర్సన్ లు బి.మెర్సీ, బి. రాణి, ఎం. శాంతి, ఎస్.రాధా, ఎన్.షాహిదా బేగం, కన్వీనర్ సునీత, కో కన్వీనర్ యం.ఈశ్వరమ్మ, జాయింట్ కన్వీనర్ లుగా బి ఈశ్వరమ, ఏ. విజయభారతి, ఎం సునీత కుమారి, హిమజ, పి.సన్టెమ్మ, ఏ మేరీ శాంతీ, ట్రెజరర్ కె.పి ముంతాజ్ బేగం. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి శ్రీనివాసులు ఉపాధ్యక్షుడు వి పొలిరెడ్డి జిల్లా సంయుక్త కార్యదర్శులు యన్ రాజశేఖర్ డి పద్మనాభ రావు కడప సిటీ అధ్యక్షుడు కె.చిన్నయ్య కార్యదర్శి సాంబశివరావు ట్రెజరర్ విజయ్ కుమార్ నవీన్ ఆచారి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అబాకస్‌లో విద్యార్థుల ప్రతిభ

నందలూరు, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:

రాష్ట్రస్థాయిలో ఆర్కే ఒలింపియాడ్ నిర్వహించిన అబాకస్, వేదిక్ మ్యాథ్స్ పోటీల్లో శ్రీ అన్నమాచార్య అకాడమీ హై స్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచారు. ఈ విషయాన్ని పాఠశాల కరస్పాండెంట్ సమ్మెట శివప్రసాద్ సోమవారం ఇక్కడి విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా సమ్మెట శివ ప్రసాద్ మాట్లాడుతూ కడపలోని శ్రీహరి డిగ్రీ కళాశాలలో ఆదివారం నిర్వహించిన ఈ పోటీల్లో రాష్ట్రం నలుమూలల నుంచి 500 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారన్నారు. ఇందులో తమ అన్నమాచార్య పాఠశాల విద్యార్థులు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను సాధించడం విశేషమన్నారు. అబాకస్ విభాగంలో సి. తేజశ్రీ ప్రథమ స్థానం, పి. ధావన్ ద్వితీయ స్థానం సాధించగా, వేదిక్ మ్యాథ్స్ వివిధ మాడ్యూల్స్‌లో జోయా మెహక్, యస్వంత్, హరి లోహిత్ తృతీయ స్థానాల్లో నిలిచారని వివరించారు. విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు ఏనుగుల బాలాంజనేయులు, డైరెక్టర్లు మాడపూరి హేమలత, సమ్మెట ఉమా మహేష్, ఉపాధ్యాయులు షఫీ ఉల్లా, స్రవంతి, శివ కుమారి, గోపిక, కృష్ణవేణి, భాగ్యలక్ష్మి తదితరులు అభినందించారు.

దేవుడితో వైసీపీ నీచ రాజకీయం

కాబట్టే 11 సీట్లకు పడిపోయాడు..

కందూరి నాగేశ్వర్ నాయుడు

సంబేపల్లి ఫిబ్రవరి 23 ప్రభాత వార్త

కలియుగ దైవం తిరుమల వెంకటేశ్వర స్వామి మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి ఆటలు ఆగాడు కాబట్టే ఆయన 11 సీట్లకే నీకు పరిమితం చేశాడని రాష్ట్ర బీసీ పాలయకిరి కార్పొరేషన్ చైర్మన్ నాగేశ్వర్ నాయుడు అన్నారు. సోమవారం తన నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డికి, వైసీపీ నేతలకు దేవుడంటే భక్తి లేదు, భయం లేదు. హిందువుల మనోభావాలంటే లెక్కేలేదు దేవదేవుడిని కూడా రాజకీయాలకు వాడుకునే స్థాయికి వైసీపీ నేతలు దిగజారారు జగన్మోహన్ రెడ్డి డైరెక్షన్‌లో కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వరస్వామి ఫొటోలను చెప్పులు, షూలు వేసుకుని నినాదాలు చేస్తూ రాజకీయం చేసే నీచానికి దిగారు అధికారంలో ఉన్నప్పుడు చట్టసభలను బూతులు, వెకిలివేషాలు కేంద్రాలుగా మార్చారు ఇప్పుడుఏకంగా దేవుడి ఫొటోలతో దిక్కుమాలిన రాజకీయాలు చేస్తున్నారు హిందూమత విశ్వాసాల పట్ల, తిరుమల తిరుపతి దేవస్థానం సంప్రదాయాలు, సంస్కృతి పజ్జగన్మోహన్ రెడ్డికి ముందు నుంచీ చిన్న చూపు ఉందిపరమ పవిత్రమైన దేవుడి ప్రసాదాన్ని జంతు కొవ్వు, ప్రమాదకర రసాయనాలతో కల్తీ చేసారు. శ్రీవారి పరకామణిలో విదేశీ కరెన్సీని కొల్లగొట్టిన కేసులో నిందితుడైన రవికుమార్తో రాజీచేసుకుని అతని ఆస్తులను టీటీడీ పేరిట రాయించి దొంగలకు పెద్దన్న లాగా జగన్ రెడ్డినిలిచాడు.శ్రీవారి ఆలయంలో శ్రీవారి నామస్మరణ తప్ప మారేది వినిపించదు. అటువంటి పవిత్రప్రదేశంలో జగన్మోహన్ రెడ్డి పిన్నిచేత "జగన్ రెడ్డి రక్షక గోవింద" అని పొగిడించుకునిశ్రీవారిని అవమానించి కోట్లాదిమంది హిందూ భక్తుల మనోభావాలు దెబ్బతీశారుశ్రీవారు నడయాడు ప్రదేశమైన మాడవీధుల్లో చెప్పులతో తిరిగి జగన్మోహన్ రెడ్డి తనకుస్వామివారి పట్ల ఉన్న నిర్లక్ష్యాన్ని చాటుకున్నాడుటీటీడీ ఆస్తులను రాజకీయ అవసరాలకు గత ఎన్నికల్లో ఉపయోగించుకున్నారు. ఎన్నికప్రచారాల్లో కరపత్రంలా లక్షల లడ్డూలను వైసీపీ నాయకులు పంచారు.టీటీడీ నిధులను దారి మళ్ళించి తిరుపతి నగరపాలక సంస్థ పేరిట కోట్ల రూపాయిలుచున్నారు.

ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు

పీలేరు, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త:

ఇంటర్మీడియట్ పరీక్షలు మొదటి ప్రశాంతంగా జరిగినట్లు చీఫ్ సూపరింటిండెంట్ బాలకృష్ణ తెలిపారు. సోమవారం పీలేరు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, బాలికల జూనియర్ కళాశాల, అంబేడ్కర్ బాలికల జూనియర్ కళాశాలలో పరీక్షలు నిర్వహించారు. మొత్తం 1087 మంది హాజరు కావాల్సి ఉండగా 44 మంది గైర్హాజరైనట్లు తెలిపారు.

అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

లక్కిరెడ్డిపల్లి ఫిబ్రవరి 23, ప్రభాతవార్త

అంగన్‌వాడీలను ప్రభుత్వోద్యోగులుగా గుర్తించాలని లక్కిరెడ్డిపల్లి ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధ్యక్షురాలు సుకుమారి పేర్కొన్నారు. ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ పిలుపుమేరకు సోమవారం స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీలను ప్రభుత్వోద్యోగులుగా గుర్తించాలని, సుప్రీంకోర్టు తీర్పు మేరకు గ్రాట్యుటీ అమలు చేయాల్సి ఉన్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. అంగన్‌వాడీల ఐక్య పోరాటాల ఫలితంగా వర్కర్లకు కనీస వేతనం రూ.11,500, హెల్పర్లకు రూ.ఏడు వేలు, మినీ వర్కర్లకు రూ.ఏడు వేలు సాధించుకున్నామని తెలిపారు. సెంటర్ల అద్దెలు, ప్రసూతి సెలవులు, వర్కర్లకు సూపర్‌వైజర్ల పోస్టుల్లో 50 శాతం ఉద్యోగోన్నతులు, ఉద్యోగ విరమణ వయో పరిమితి, రిటైర్మెంట్ బెనిఫిట్స్ తదితర వాటిని సాధించుకున్నామని వివరించారు. అంగన్‌వాడీ వర్కర్లను మూడో తరగతి, హెల్పర్లను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. కనీస వేతనాలు రూ.26 వేలు ఇవ్వాలని, పింఛను, పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యం కల్పించాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. రాబోయే కాలంలో ఈ సమస్యలన్నింటిపై పోరాటం కొనసాగుతుందన్నారు. పెంచిన విద్యుత్ ఛార్జీల బిల్లులను భోగి మంటల్లో వేసి నిరసన తెలియజేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి యూనియన్ నాయకులు ఓబులమ్మ, ప్రభావతి, అంగన్వాడి హెల్పర్లు స్వప్న ప్రశాంతి, గంగులమ్మ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామాగ్రి పంపిణి..

సుండుపల్లె, ఫిబ్రవరి 23,ప్రభాతవార్త :

మండల పరిధిలోని రాయవరం ఎంపీపీఎస్ మోడల్ ప్రైమరీ పాఠశాలలో ఎస్జిటి టీచర్‌గా పని చేయుచున్న ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత నంద్యాల వెంకట సిద్దయ్య మరియు వారి సతీమణి నాగేశ్వరి జీకే రాచపల్లి జడ్పీహెచ్ఎస్ పాఠశాల నందు పదవ తరగతి చదువు చున్న 60 మంది విద్యార్థులకు ఎగ్జామ్ రైటింగ్ ప్యాడ్స్, పెన్నులు, రబ్బర్లు, షార్పనర్స్, స్కేల్స్ లాంటి విద్యాసామగ్రిని పిల్లల విద్యాభివృద్ధిని ఆకాంక్షిస్తూ పాఠశాల హెచ్ఎం మేడం అయిన మహబూబ్ జాన్ చేతుల మీదగా ఆ పాఠశాల ఉపాధ్యాయులు ఆధ్వర్యంలో పిల్లలకు విద్యాసామగ్రిని పంపిణీ చేయడం జరిగిందన్నారు.

పోలీస్‌శాఖ అభివృద్ధి పనుల కోసం విరాళం

మదనపల్లె క్రైమ్, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త.

మదనపల్లి పట్టణ పరిధిలో పోలీస్ శాఖకు సంబంధించి జరుగుతున్న అభివృద్ధి పనుల కోసం ప్రముఖ రియల్ ఎస్టేట్ వ్యాపారి టి.కృష్ణప్ప నాయుడు(టీకేఎన్) రూ.10లక్షల విరాళాన్ని అందజేశారు. సోమవారం డీఎస్పీ కార్యాలయంలో అడిషనల్ ఎస్పీ వెంకటాద్రిని కలిసి చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో చేస్తున్న నిర్మాణాలు, అభివృద్ధి పనులకు తనవంతు సహకారంగా రూ.10లక్షలు ఆర్థిక సహాయం అందజేస్తున్నట్లు టి. కృష్ణప్పనాయుడు తెలిపారు. జిల్లా కేంద్రంగా మదనపల్లిను ఏర్పాటుచేసినందుకు కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా కేంద్రంలో ప్రభుత్వ శాఖల కార్యాలయాలు, ట్రాఫిక్ నియంత్రణ కోసం, రోడ్లు వెడల్పు, శాంతి భద్రతల కోసం అవసరమైన సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరాలు,ఇతర అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్న నేపథ్యంలో సామాజిక బాధ్యతతో తనవంతు ఆర్థిక సహాయం అందించినట్లు తెలిపారు.

హుండీ ద్వారా రూ. 59.35లక్షల

బోయకొండ(చౌడేపల్లి), ఫిబ్రవరి 23 ప్రభాతవార్త

శక్తిస్వరూపిణీ బోయకొండ గంగమ్మకు హుండీ ద్వారా రూ. 59,35,839 లు ఆదాయంగా సమకూరినట్లు ఇఓ, ఉపకమీషనర్ ఏకాంబరం తెలిపారు. ఆయన కథనం మేరకు...కొండపై 45రోజులకుగాను లెక్కింపు నిర్వ హించగా నగదుతోపాటు 38గ్రాముల బంగారం, 155గ్రాముల వెండి ఆదా యంగా వచ్చిందన్నారు. అదే విధంగా రణభేరీ గంగమ్మ హుండీ నుంచి రూ. 34,024లు, అన్నదాన హుండీ ద్వారా రూ. 13,495లను వివిధ రకాల విదేశీ కరెన్సీని భక్తులు కానుకలుగా వేశారన్నారు. ఎండోమెంట్ ఎసీ చిట్టెమ్మ, సేవక్‌లు, ఆలయ అధికార, అర్చక, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ సబ్ స్టేషన్ సందర్శన

మైదుకూరు, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:

మైదుకూరు పట్టణ జిల్లా పరిషత్ హై స్కూల్ పాఠశాలలో వృత్తి విద్య లో భాగంగా ఎలక్ట్రానిక్స్ ట్రేడ్ విద్యార్థులకు విద్యుత్ సబ్ స్టేషన్ పారిశ్రామిక సందర్శన నిర్వహించబడింది. సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్శన మైదుకూరు మండలంలోని 33/11 కెవి సబ్‌స్టేషన్‌లో నిర్వహించబడింది. సబ్‌స్టేషన్ అసిస్టెంట్ ఇంజనీర్ ఏ.ఈ రామ భద్రయ్య అనుమతితో విద్యార్థులకు సందర్శనకు అవకాశం కల్పించబడింది. ఆయన మార్గదర్శకత్వంలో విద్యార్థులు సబ్‌స్టేషన్ పనితీరును సమగ్రంగా పరిశీలించారు. ఈ కార్యక్రమాన్ని ఎలక్ట్రానిక్స్ ట్రైనర్ ఎస్. మధురిమ పర్యవేక్షణలో నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఇలియాస్ అహమ్మద్ అనుమతితో ఈ విద్యా కార్యక్రమం చేపట్టారు.సబ్‌స్టేషన్ సందర్శనలో విద్యార్థులు ట్రాన్స్ ఫార్మర్ల పని విధానం, విద్యుత్ సరఫరా విధానం, హై వోల్టేజ్ మరియు లో వోల్టేజ్ లైన్ల నిర్వహణ, భద్రతా నియమాలు వంటి అంశాలపై అవగాహన పొందారు. అక్కడి సిబ్బంది విద్యార్థులకు ప్రత్యక్షంగా వివరాలు అందించారు. ఈ సందర్శన ద్వారా విద్యార్థులు ప్రాయోగిక జ్ఞానం సంపాదించి, ఎంతో ఆసక్తితో కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమాన్ని ప్రధానోపాధ్యాయులు ఇలియాస్ అహమ్మద్ ప్రారంభించారు. కార్యక్రమంలో స్టాఫ్ సెక్రటరీ గోశెట్టి రామమోహన్ సీనియర్ ఉపాధ్యాయులు రాముడు, శ్రీనివాసులు,వెంకటేశ్వరులు, పద్మనాభయ్య, ఆనందరావు, గురుమోహన్, తేజ,విశ్వం మరియు ఇతర బోధనా, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.ఇలాంటి పారిశ్రామిక సందర్శనలు విద్యార్థుల సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించడంతో పాటు వృత్తి విద్య పట్ల ఆసక్తిని మరింతగా పెంచుతాయన్నారు.

క్షయ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలి

గాలివీడు, ఫిబ్రవరి 23(ప్రభాతవార్త):

క్షయ వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారిణి డా.శ్వేతా తెలిపారు. సోమవారం నూలివీడు ఉర్దూ పాఠశాలలో క్షయ వ్యాధిపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఫిబ్రవరి 17 నుంచి మార్చి 23 వరకు క్షయ వ్యాధి వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్షయ వ్యాధి అంటువ్యాధి అని, వ్యాధిగ్రస్తుడు దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు తుంపరులు గాలిలో కలవడం వలన ఆగాలని ఆరోగ్యవంతమైన వ్యక్తి పీలిస్తే క్షయ వ్యాధి వస్తుందన్నారు. మితిమీరిన దగ్గు, జ్వరం, బరువు తగ్గడం, ఆకలి లేకపోవడం, దగ్గినపుడు గళ్లలో రక్తం పడటం వంటివి వ్యాధి లక్షణాలను తెలియజేస్తాయన్నారు. వైద్యుల సూచనల మేరకు తగిన జాగ్రత్తలు పాటిస్తే క్షయవ్యాధిని అదుపులో ఉంచుకోవచ్చన్నారు. క్షయ వ్యాధిగ్రస్తులకు 6 మాసాల పాటు మందులు ఉచితంగా ఇస్తున్నట్లు తెలిపారు. అంతేగాక నెలకు వెయ్యి రూపాయల చొప్పున 6 మాసాలు రూ.6 వేలు వ్యాధిగ్రస్తుల కాతాలకు జమచేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మున్వర్‌బాషా, ఎంపీహెచ్ఈఓ శ్రీనివాసులురెడ్డి, టీబీ సూపర్‌వైజర్ హరి, ఏఎన్ఎం కళావతి, ఆశా రేవతి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా చేయడమే లక్ష్యం : కలెక్టర్

మదనపల్లి, ఫిబ్రవరి 23: ప్రభాతవార్త

నిరక్షరాస్యులుయిన వయోజనులను అక్షరాస్యులుగా చేయడమే ఉల్లాస్ కార్యక్రమ లక్ష్యం అని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం ఉదయం మదనపల్లి కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాల్లో వయోజన విద్య శాఖ వారిచే ఉల్లాస్ - అక్షర ఆంధ్ర కార్యక్రమకు సంబంధించిన గోడ పత్రికలను జిల్లా కలెక్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఉల్లాస్ కార్యక్రమం యొక్క ప్రధాన లక్ష్యం 2029 నాటికి వయోజనులందరినీ అక్షరాస్యులుగా మార్చడమనన్నారు. ఈ పథకం ద్వారా 15 సంవత్సరాలు, అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్న నిరక్షరాస్యులకు ప్రాథమిక విద్య అందించబడుతుందని తెలిపారు. అక్షరాస్యతతో పాటు వారికి ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ అక్షరాస్యత,వాణిజ్య నైపుణ్యాలు,ఆరోగ్య సంరక్షణ,కుటుంబ సంక్షేమం వంటి జీవిత నైపుణ్యాలు నేర్పబడతాయని తెలిపారు. ఈ కార్యక్రమం జిల్లా, మండల, పట్టణ స్థాయిల్లో కమిటీలు ఏర్పాటు చేసి పర్యవేక్షి స్తున్నారని తెలిపారు. స్వచ్ఛంద ఉపాధ్యాయులు (వాలంటీర్లు) ద్వారా తరగతులునిర్వహిస్తున్నారని సర్వేలు నిర్వహించడానికి, అభ్యాసకులు, వాలంటీర్లను నమోదు చేయడానికి ఉల్లాస్ మొబైల్ యాప్ ఉపయోగిస్తున్నారని తెలిపారు.జిల్లా, మండల స్థాయిల్లో శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, 'అక్షరఆంధ్ర' వాచకాలు అభ్యాసకులకు పంపిణీ చేస్తున్నారని తెలిపారు.ఈ కార్యక్రమం ద్వారా వయోజనులను అక్షరాస్యులు గా చేసి,వారిని సమాజంలో చైతన్య వంతులు గా తీర్చిదిద్దడం లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని జిల్లా కలెక్టర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో వయోజన విద్య డిడి వెంకటసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గోడపత్రికలు ఆవిష్కరిస్తున్న కలెక్టర్

మంత్రిని కలిసిన ఏపీఎస్ఆర్టీసీ ఎండి

రాయచోటి ఫిబ్రవరి 23 ప్రభాతవార్త

మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని ఆర్టీసీ ఎండీ వి.బాలసుబ్రమణ్యం అసెంబ్లీ ప్రాంగణంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆర్టీసీ బలోపేతం, స్త్రీ శక్తి పథకం అమలు తీరుపై, అలాగే ఆర్టీసీలో తదుపరి కార్యాచరణలపై ఇరువురు విస్తృతంగా చర్చించారు.

బాబా 150వ జయంతి వేడుకలు

బద్వేలు అర్బన్, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త

స్వచ్ఛ భారత్‌కు ఆద్యుడు, ప్రముఖ సంఘసంస్కర్త సంత్ గాడ్గే బాబా 150వ జయంతి వేడుకలు సోమవారం పట్టణంలోని ఎన్‌జీఓ హోంలో నిర్వహించబడ్డాయి. మహనీయుల ఆశయాల సాధన సమితి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అలాగే సామాజిక వేత్త, మాజీ ఎమ్మెల్సీ కీ.శే ఐలాపురం వెంకయ్య చిత్రపటానికి కూడా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సమితి వ్యవస్థాపకులు బద్వేలు గురుమూర్తి మాట్లాడుతూ, మహారాష్ట్ర రాష్ట్రంలోని అమరావతి జిల్లా షెంద్గావ్ గ్రామంలో 1876 ఫిబ్రవరి 23న జన్మించిన గాడ్గే బాబా సమాజ హితం కోసం జీవితాన్ని అంకితం చేశారన్నారు. పరిశుభ్రత, సామాజిక సమానత్వం, మూఢనమ్మకాల నిర్మూలన కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. బి.సి చైతన్య సమితి జాతీయ అధ్యక్షుడు బి.సి రమణ మాట్లాడుతూ పరిశుభ్రతే దైవమని బోధించిన గాడ్గే బాబా అంటరానితనం, జంతు బలులను వ్యతిరేకించారని తెలిపారు. యోగివేమన విశ్వవిద్యాలయ పాలకమండలి సభ్యుడు కొండపల్లి చిన్న సుబ్బారావు మాట్లాడుతూ విద్యా, వైద్య రంగాల్లో బాబా చేసిన సేవలను గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు సామాజిక సంస్థల ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అల్లర్ల కేసులో నిందితులకు పోలీసుల కౌన్సిలింగ్

మదనపల్లె క్రైమ్, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త.

పట్టణంలోని నీరుగట్టువారిపల్లిలో ఇటీవల చిన్నారి రిషిక ప్రియ హత్య నేపథ్యంలో జరిగిన ఆందోళనలు, జాతీయ రహదారి దిగ్బంధనం కేసుల్లో నిందితులను గుర్తించిన పోలీసులు వారికి కౌన్సిలింగ్ చేశారు. అన్నమయ్య జిల్లా ఎస్పీ ధీరజ్ కునిబల్లి ఆదేశాల మేరకు, అడిషనల్ ఎస్పీ వెంకటాద్రి పర్యవేక్షణలో మదనపల్లి వన్ టౌన్, టూ టౌన్ పోలీసులు ఈ చర్యలు చేపట్టారు. డ్రోన్ కెమెరాల సాయంతో ఆందోళనకారులను గుర్తించారు. గొడవల్లో కీలక పాత్ర పోషించిన సుమారు 30 మందిని వన్ టౌన్, టూ టౌన్ పోలీస్ స్టేషన్లకు పిలిపించి విచారించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని వన్ టౌన్ సీఐ కె. రాజారెడ్డి, టూ టౌన్ సీఐ మహమ్మద్ రఫీలు హెచ్చరించారు. ఏదైనా నిరసన తెలపాలనుకుంటే ముందస్తుగా పోలీసుల అనుమతి తీసుకోవాలని స్పష్టం చేశారు. కొన్ని అసాంఘిక శక్తులు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకొని ప్రజలను ఇబ్బందులకు గురిచేయడం తగదన్నారు. ప్రజలు ఇలాంటి వారి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ సంఘటనల్లో పాల్గొన్న మరికొందరిని కూడా గుర్తిస్తున్నామని, ఎవరినీ వదిలిపెట్టే ప్రసక్తి లేదన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై నిఘా కొనసాగుతోందని సి ఐ లు తెలిపారు.

ఫిర్యాదుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి - జిల్లా ఎస్పీ

కడప క్రైం, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:

కడప జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజా పిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా ఎస్పీ షెల్కే నవికేత్ విశ్వనాథ్ పాల్గొని జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి వివిధ సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ఫిర్యాదుదారులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. మొత్తం 102 ఫిర్యాదులు పీజీఆర్ఎస్‌కు వచ్చాయి. ఈ సందర్భంగా ఎస్పీ ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి వాటిని పరిశీలించి సంబంధిత పోలీసు అధికారులతో ప్రత్యక్షంగా ఫోన్‌లో మాట్లాడారు. చట్టపరమైన పరిమితులలో నిర్ణీత గడువులోపు వాటిని పరిష్కరించాలంటూ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. బాధితులకు న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ పోలీసు శాఖ ద్వారా పరిష్కారం అయ్యే ప్రతి ఫిర్యాదును ప్రజలు స్వేచ్ఛగా మా దృష్టికి తేవచ్చన్నారు. ప్రజల నుంచి అందిన ఫిర్యాదులను నిర్ణీత సమయంలో చట్ట పరిధిలో పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ సమస్యలపై ప్రజలు తమ వినతులను విన్నవించుకుంటున్నారు. వాటిపై సంబంధిత పోలీసు అధికారులతో ఎస్పీ నేరుగా మాట్లాడి సమస్యను చట్ట పరిధిలో పరిష్కరించాలని ఆదేశించారు. నడవలేని వృద్ధులు, దివ్యాంగుల కోసం జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా వీల్ ఛైర్లను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (పరిపాలన) కె.ప్రకాష్‌బాబు, మహిళా పీఎస్ డీఎస్పీ బాలస్వామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూఏ క్రీడా జట్లు ఎంపిక

కడప క్రైం, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:

జేఎన్‌టీయూఏ క్రీడా మండలి నిర్వహించిన కఠినమైన జట్ల ఎంపిక ట్రయల్స్, వార్షిక క్రీడా పోటీలు మరియు అథ్లెటిక్స్ మీట్‌లో అద్భుత ప్రతిభ కనబరిచి విశేష విజయాన్ని సాధించారు. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఈ ఎంపికల్లో కెఎస్ఆర్ఎమ్‌కు చెందిన వివిధ శాఖల, వివిధ సంవత్సరాల విద్యార్థులు జూడో, బాల్ బ్యాడ్మింటన్, హ్యాండ్‌బాల్, హాకీ, వాలీబాల్, క్రికెట్ వంటి విభాగాల్లో 11 మంది ఎంపికై గర్వకారణంగా నిలిచారు.జెఎన్ టీ యు స్పోర్ట్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ట్రయల్స్‌లో కాంస్టిట్యుయెంట్, ఆటోనమస్, అనుబంధ కళాశాలల విద్యార్థులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. తీవ్ర పోటీ మధ్య